teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి: 04 | సంచిక: 278 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | మంగళవారం 14 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


## కేసీఆర్‌తో ప్రయాణం నా అదృష్టం

ఆత్మగౌరవం కోసమే కాంగ్రెస్ వీడుతున్నా మాజీ మంత్రి జీవన్ రెడ్డి




3

## టెట్ నోటిఫికేషన్ విడుదల



- ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- లక్షలాది మంది నిరీక్షణకు తెర
- జూన్ 15 నుంచి టెట్ పరీక్షలు ప్రారంభం

2



## పన్నులు మావి.. పెత్తనం మీదా?

- ఢిల్లీకి సలాం కొట్టే ప్రసక్తే లేదు
- రెండు వర్గాల పౌరులుగా మిగిలిపోతామా
- జనాభాతో పాటు జీఎస్డీపీని పరిగణనలోకి తీసుకోవాలి

### ఢిల్లీ పాలకులపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు



హైదరాబాద్, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):
దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "మేము పన్నులు కట్టాలి.. కానీ ఢిల్లీకి వెళ్లి సలాం కొట్టాలి అన్నట్టుగా దక్షిణాది పరిస్థితి తయారైంది" అంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఆర్థిక రాజధానులుగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలను, రాజకీయ - మిగతా2లో



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- అగ్రనేత రూపి మృతి
- రూ. 25 లక్షల రివార్డు ఖతం
- భద్రతా బలగాల చేతిలో ఏరియా కమాండర్ హతం

2




## భాగ్యనగరంలో భగ్గుమంటున్న ఎండలు

- రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్
- హైదరాబాద్‌లో విద్యుత్ 4,381 మెగావాట్ల వినియోగం
- చరిత్రలో రెండో అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదు

2



## భూ సమస్యలకు "శాశ్వత పరిష్కారం భూభారతి"

- ప్రతి సర్వే నంబర్‌కు విశిష్ట భూధార్ గుర్తింపు
- త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా సమీకృత భూభారతి పోర్టల్
- ఆధునిక రోవర్ టెక్నాలజీతో భూముల రీ-సర్వే

2

## ఆర్టీసీలో సెగలు రేపుతున్న సమ్మె నోటీసు

- ఈ నెల 23 నుంచి బస్సులు బంద్..?
- లేబర్ కమిషనర్‌తో జేఏసీ కీలక భేటీ
- ఆర్టీసీ కార్మికుల భవిష్యత్తు తేలేది నేడే



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):
తెలంగాణ రాష్ట్రంలో మరోసారి సమ్మె సైరన్ మోగనుంది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ మేరకు నోటీసు ఇచ్చారు. ఈ రోజున ఈ సమ్మె విషయంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నెల 23వ తేదీ నుంచి సమ్మెకు - మిగతా2లో



## సొంత గూటిపైనే కవిత సమరం

- తండ్రిని ఏడిపించొద్దు..
- చెల్లెలి అడుగులపై అన్న కేటీఆర్ ఫైర్
- టీఆర్ఎస్ సెంటిమెంట్‌తో కవిత సరికొత్త రాజకీయం
- బీఆర్ఎస్ వర్గాల్లో గుబులు

2



## విలీనం, సంఘాల గుర్తింపు నా పరిధిలో లేవు

- ప్రేరేపిత సమ్మెలకు వెళ్లవద్దు.. చర్చలకు ప్రభుత్వం సిద్ధం
- ఆర్టీసీ సమ్మెపై మంత్రి పొన్నం కీలక వ్యాఖ్యలు

2



## చావైనా బతుకైనా కరీంనగరే

- నా శవంపై కప్పేది కూడా బీజేపీ జెండానే
- సీఎం రేవంత్ వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్
- రేవంత్ హైబ్రిడ్ మోడల్ అశాస్త్రీయం
- డబ్బుకు, ఓటుకు లింకు పెడతారా: బండి నిలదీత

హైదరాబాద్, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):
తన రాజకీయ భవిష్యత్తుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అత్యంత ఆవేశపూరితంగా స్పందించారు. నేను వలసపోవడానికి అవకాశవాదిని కాదు.. రేవంత్ రెడ్డిని అంతకంటే కాదు అంటూ తీక్షణమైన విమర్శలు గుప్పించారు. - మిగతా2లో

## అమీన్‌పూర్‌లో హైడ్రా మెగా ఆపరేషన్

- ఆరంతస్తుల అక్రమ కట్టడం కూల్చివేత
- 861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- శరవేగంగా ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్
- హైడ్రా చర్యలపై స్థానికుల హర్షం

వివరాలు 3లో..





2

## డెడ్ స్టోరేజీకి చేరువలో నాగార్జున సాగర్

వేసవి ప్రారంభంలోనే నీటి నిల్వలు నిల్
15 టీఎంసీల లోటుతో పెను ప్రమాదం

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు


- అసత్య ప్రచారాలపై న్యాయపోరాటం
- అంగన్‌వాడీ ఫోన్ల కొనుగోలుపై వివాదం
- బీఆర్ఎస్ సోషల్ మీడియా పోస్టులపై సీతక్క సీరియస్
- క్షమాపణ చెప్పాల్సిందే.. లేదంటే జైలుకే
- కేసీఆర్‌కు మంత్రి సీతక్క వార్నింగ్



వివరాలు 2లో..

## డెడ్ స్టోరేజీకి చేరువలో నాగార్జున సాగర్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):



కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని తెలంగాణ జిల్లాల్లో వేసవి ప్రారంభంలోనే ప్రమాద గంటికలు మోగుతున్నాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆందోళనకరంగా తగ్గిపోతున్నాయి. హైదరాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీరు అందించే నాగార్జున సాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం 530 అడుగులు కాగా, 170 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇందులో 131 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉంది. వేసవి అవసరాలకు 55 టీఎంసీలు అవసరం కాగా, ప్రస్తుతం డెడ్ స్టోరేజీ పోగా కేవలం 40 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. అంటే వేసవి అవసరాలకు 15 టీఎంసీల నీటి కొరత ఉంది. ఈ పరిస్థితి తాగునీటి కష్టాలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## టెట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఉపాధ్యాయ కొలువుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2026 సంవత్సరానికి సంబంధించి తొలి విడత ఉపాధ్యాయ అర్హత పరీక్ష నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ అధికారికంగా విడుదల చేసింది. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగుల నిరీక్షణకు తెరపడింది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం, ఈ నెల ఏప్రిల్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అభ్యర్థులు టీజీ టెట్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుమును కూడా కేవలం ఆన్‌లైన్ మోడ్‌లోనే స్వీకరిస్తారని అధికారులు స్పష్టం చేశారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలన్న నిబంధనలో భాగంగా, ఈ ఏడాది మొదటి విడత షెడ్యూల్‌ను ఇప్పుడు ప్రకటించారు. టెట్ పరీక్షలను జూన్ 15 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. పరీక్షకు సుమారు వారం రోజుల ముందు అంటే, జూన్ మొదటి వారంలో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పిస్తారు. పరీక్షలు ముగిసిన వెంటనే ప్రాథమిక కీ మరియు అభ్యంతరాల స్వీకరణ పూర్తి చేసి, జూలై నెలలో తుది ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది.

# సొంత గూటిపైనే కవిత సమరం

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):



కవిత కొత్త పార్టీ ప్రకటన వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. టీఆర్ఎస్ పేరు ఖాళీ గా ఉందంటూ కవిత చేసిన వ్యాఖ్యలతో బీఆర్ఎస్ అలర్ట్ అయింది. కీలక మంత్రాంగం మొదలు పెట్టింది. అదే సమయంలో తండ్రిని ఏడిపించవద్దంటూ కవిత రాజకీయం పైన కేటీఆర్ రివర్స్ సెంటిమెంట్ తెర మీదకు తెచ్చారు. కవిత ను రాజకీయంగా దెబ్బ తీసేందుకు బీఆర్ఎస్ సిద్దమైనట్లు తేలిపోయింది. దీంతో ఇప్పుడు రాజకీయంగా ఏం చేయబోతున్నారు. కవిత ఈ నెల 25న కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. కేంద్రం అటు మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం వేళ.. తెలంగాణలో కవిత కొత్త పార్టీ ప్రకటిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలో అనేక కొత్త పార్టీలు రావటం తరువాత పరిణామాలతో ఇప్పుడు కవిత పార్టీ పైనా చర్చ సాగుతోంది. తాజాగా కొత్త పార్టీకి సంబంధించి కవిత చేసిన వ్యాఖ్యలు ఆసక్తి కలిగిస్తున్నాయి. తండ్రి కేసీఆర్ మొదట స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరును కవిత వాడుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ సెంటిమెంట్ కూడా తనకు వర్కౌట్ అవుతుందని కవిత భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కేటీఆర్ కొత్త సెంటిమెంట్ తెర మీదకు తీసుకొచ్చారు. తండ్రిని ఏడిపంచవద్దంటూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. వ్యక్తి గత సమస్యలతో పార్టీలు స్థాపిస్తే మనుగడ ఉండదని వ్యాఖ్యానించారు. కాగా, కవిత రాజకీయం అంత సులువుగా చేసే అవకాశాలు కనిపించటం లేదు. అటు రేవంత్ అటు కేసీఆర్ కేంద్రంలో ఉన్న బీజేపీ వచ్చే తెలంగాణ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటు న్నాయి. తన తండ్రి వ్యూహాలు రాజకీయ సామర్థ్యం గురించి అందరికంటే కవితకే ఎక్కువగా తెలుసు. ఇటు రేవంత్ సైతం అధికారం నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉన్నారు. ఇక బీజేపీ రాజకీయ లెక్కలే వేరు. ఈ పార్టీల నడుమ కవిత తన పార్టీని భిన్నమైన ప్రజా వేదికగా సామాజిక – ఆర్థిక ప్రత్యామ్నాయంగా ప్రజల్లో నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఇక, బీఆర్ఎస్ నేతల పైన విమర్శలు చేస్తేనే కేసీఆర్ పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేసారు. పార్టీకి నష్టం చేసే విధంగా కవిత రాజకీయ అడుగులు వేస్తుంటే కేసీఆర్ మౌనంగా ఉండే పరిస్థితి ఉండదనేది సుస్పష్టం. ఇక కవిత వెనుక రేవంత్ మద్దతు ఇస్తున్నారనే వాదన బీజేపీ నేతలు వ్యూహాత్మకంగా తెర పైకి తీసుకొస్తున్నారు. కవిత పార్టీ పోటీలో ఉంటే బీఆర్ఎస్ ఓటింగ్ చీల్చే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. అయితే వచ్చే ఎన్నికలు కేసీఆర్ నాయకత్వానికి ఒక విధంగా ప్రతిష్ఠాత్మకం. అదే విధంగా రేవంత్, బీజేపీ భవిష్యత్ తెలంగాణలో డిసైడ్ చేసేవి. ఇక కవిత బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మౌనంగా ఉండి ఇప్పుడు అదే పార్టీ నేతల పైన విమర్శలు చేస్తే ఎంత వరకు ప్రజామోదం లభిస్తుందనేది కీలకంగా మారుతుంది. సామాజిక తెలంగాణ అజెండాగా చెబుతున్న కవిత ఆచరణలో ఎంత వరకు చేసి చూపిస్తారనేది మరో ప్రధాన ప్రశ్న. ఇక షర్మిల ఎపిసోడ్ సైతం పలువురు గుర్తు చేస్తున్నారు. ప్రాంతీయ పార్టీల్లో టీడీపీ, బీఆర్ఎస్ మినహా తెలంగాణలో నిలిచినవి ప్రభావం చూపించినవి చాలా తక్కువ. దీంతో కవిత తన అజెండాతో జనంను ఎంత వరకు నమ్మించగలుగుతారు. ఎలా నిలుస్తారనేది రాజకీయంగా ఆసక్తిని పెంచుతోంది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):





ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నక్సల్ ప్రభావిత కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాలు భారీ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. చోటే బెటియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న పక్కా సమాచారంతో భద్రతా బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈ సందర్భంగా మావోయిస్టులు తారసపడటంతో భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్ లో పార్థాపూర్ ఏరియా కమాండర్, మోస్ట్ వాంటెడ్ మావో నేత రూపి అలియాస్ రంగబోయిన భాగ్య మృతిచెందారు. ప్రభుత్వం ఆమెపై గతంలో రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. కాగా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన రూపి 2025లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు అగ్రనేత విజయ్ రెడ్డి భార్య. ఎన్‌కౌంటర్ అనంతరం ఘటనా స్థలం నుంచి ఒక ఆటోమేటిక్ తుపాకీతోపాటు విప్లవ సాహిత్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు కాంకేర్ జిల్లా ఎస్పీ నిఖిల్ రాఖేచా వెల్లడించారు. కాల్పుల అనంతరం మరో 10 మంది మావోయిస్టులు తప్పించుకున్నారు. వారి కోసం మాచ్‌పల్లి అడవుల్లో గాలింపు చర్యలను మరింత ముమ్మరంచేశారు. ఈ ఎన్‌కౌంటర్‌పై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ స్పందిస్తూ అడవుల్లో ఉన్న మావోయిస్టులకు సమయం చాలా తక్కువగా ఉందని, ఇప్పటికైనా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని హెచ్చరించారు. హింసా మార్గాన్ని వీడి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని సూచించారు. హతమైన రూపి స్వస్థలం తెలంగాణలోని సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంగా గుర్తించారు. ఆమె వయసు 46 సంవత్సరాలు. 2004లో మావోయిస్టు పార్టీలో చేరిన ఆమె తొలుత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేశారు. ఆ తర్వాత అబూజ్‌మడ్ వంటి కఠినమైన ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన క్రియాశీల మావోయిస్టుల జాబితాలో కూడా రూపి పేరు ఉంది. గతంలో లొంగిపోవాలని పోలీసులు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఆమె తన సాయుధ పోరాటాన్నే కొనసాగించారు. కీలకమైన ఏరియా కమాండర్ మరణించడంతో మావోయిస్టు నెట్‌వర్క్‌కు తీరని లోటు అని భద్రతా దళాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అదనపు బలగాలతో వేట కొనసాగుతోంది.

# భూ సమస్యలకు “శాశ్వత పరిష్కారం భూభారతి”

హైదరాబాద్, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):

గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సమూలంగా ప్రక్షాళన చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం సచివాలయంలో ఆయన అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ?ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భూభారతి కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, తెలంగాణలో భూ హక్కుల పరిరక్షణలో ఒక సరికొత్త శకానికి నాంది అని పేర్కొన్నారు. గతంలో ధరణి పోర్టల్ మరియు 2020 ఆర్ఓఆర్ (=ూ=) చట్టం వల్ల రైతులు తమ సొంత భూమిని నిరూపించుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఆ ఇబ్బందులను తొలగిస్తూ గతేడాది ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ‘భూభారతి’ పోర్టల్‌ను ప్రారంభించామని గుర్తు చేశారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రతి సర్వే నంబర్‌కు ఒక విశిష్ట ‘భూధార్’ (దీష్ట్రసష్ఘుతీ) నంబర్‌ను కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తెస్తూ ఎన్ఐసీ (చీ×జ) సహకారంతో రూపొందించిన సమీకృత పోర్టల్‌ను ఇప్పటికే ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించామని, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని వెల్లడించారు. నిజాం కాలం నాటి పాత మ్యాప్‌ల స్థానంలో ఆధునిక రోవర్ (=శీజవతీ) టెక్నాలజీని వాడుతున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే 411 రోవర్లను సేకరించామని, మరో 400 రోవర్లను త్వరలో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. శిక్షణ పొందిన 5,520 మంది లైసెన్స్డ్ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారని, 10,984 రెవెన్యూ గ్రామాల్లో దశలవారీగా రీ-సర్వే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో భూ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, భూభారతి ద్వారా రైతుల సమస్యలను పరిష్కరిస్తూ అవినీతి రహిత రెవెన్యూ సేవలను అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పునరుద్ఘాటించారు.



## పన్నులు మావి.. పెత్తనం మీదా..?

-మొదటిపేజీ తరువాయి

రాజధానులైన ఉత్తరాది రాష్ట్రాలు తక్కువ చేసి చూడటం సరికాదని ఆయన హితవు పలికారు.ఉత్తరాది రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యం పెరిగి, దక్షిణాది రాష్ట్రాలు కేవలం ఆదాయ వనరులుగానే మిగిలిపోతే.. భవిష్యత్తులో దక్షిణాది ప్రజలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మారిపోయే ప్రమాదం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)కు ముడి పెట్టకూడదని ఆయన డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన కేవలం జనాభా ప్రాతిపదికన మాత్రమే జరిగితే, కుటుంబ నియంత్రణ పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఆయన ఒక హైబ్రిడ్ మోడల్ ను ప్రతిపాదించారు.

**జనాభా ప్రాతిపదిక**

పెంచాలనుకుంటున్న 272 అదనపు సీట్లలో 136 సీట్లను జనాభా ప్రాతిపదికన కేటాయించాలి.

**జీఎస్డీపీ ప్రాతిపదిక**

మిగిలిన 136 సీట్లను రాష్ట్రాల స్థూల ఉత్పత్తి లేదా దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయా రాష్ట్రాలు అందిస్తున్న సహకారం ప్రాతిపదికన కేటాయించాలి. ఈశాన్య రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రాతినిధ్యం కోసమే ఎంపీ సీట్లు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. అదే సూత్రాన్ని దక్షిణాది రాష్ట్రాలకు కూడా వర్తింపజేయాలని కోరారు. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నందున, కేంద్రం హడావుడి నిర్ణయాలు తీసుకుని దేశంలో ఉత్తరాది-దక్షిణాది మధ్య అగాధాన్ని పెంచవద్దని ఆయన సూచించారు.

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్)




రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు లీగల్ నోటీసులు పంపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, దానికి పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్ బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు.

?మంత్రి సీతక్క తరపు న్యాయవాది నాగులూరి కృష్ణ కుమార్ ఈ రోజు (ఏప్రిల్ 13, 2026) రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఈ నోటీసులను పంపారు. అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగాలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని, తన ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ పారదర్శకంగా నిర్వహించిందని, టెండర్ ఇవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారమే కాంట్రాక్ట్ ఖరారు అయిందని స్పష్టం చేశారు. ఇందులో మంత్రికి ఎటువంటి వ్యక్తిగత ప్రమేయం లేదని నోటీసులో వివరించారు. మొత్తం టెండర్ విలువ రూ. 44 కోట్లు మాత్రమే ఉండగా, అందులో రూ. 30 కోట్ల అవినీతి జరిగిందని ప్రచారం చేయడం హాస్యాస్పదమని, ఇది కుట్రపూరితమైన ఆరోపణ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఉన్న అభ్యంతరకర పోస్టులను 48 గంటల్లోగా తొలగించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై నిర్ణీత సమయంలోగా స్పందించని పక్షంలో, కేసీఆర్ పై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం వ్యక్తుల వ్యక్తిత్వాన్ని హననం చేసేలా అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## చాయ్‌పైనా బతుకైనా కరీంనగరే

-మొదటిపేజీ తరువాయి

తన చివరి శ్వాస వరకు కరీంనగర్ గడ్డపైనే ఉంటానని, బీజేపీని వీడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. బండి సంజయ్ కూడా లక్ష్మణ్ మాదిరిగా ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లక తప్పదన్న రేవంత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. నా రక్తం కాషాయం. నేను చనిపోతే నా శవంపై కప్పేది కూడా కాషాయ జెండానే. ఆ దృశ్యాన్ని చూడటానికైనా రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు బతికి ఉండాలి అని వ్యాఖ్యానించారు. తాను రాజకీయం కోసం సిద్ధాంతాలను వదులుకునే వ్యక్తిని కాదని ఈ సందర్భంగా ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై సీఎం ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్ ను బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వంటి అంశాలను రాజకీయం చేయడం తగదని కేంద్రమంత్రి హితవు పలికారు. రేవంత్ రెడ్డి చెప్పే హైబ్రిడ్ మోడల్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ప్రతి అంశాన్ని తన రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం మానుకోవాలని బండి సంజయ్ చురకలంటించారు.

## ఆర్టీసీలో సెగలు రేపుతున్న సమ్మె నోటీసు

-మొదటిపేజీ తరువాయి

దిగుతున్నట్లు హెచ్చరించారు. దీంతో ఈ సాయంత్రం లేబర్ కమిషనర్‌తో ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు భేటీ అవుతున్నారు. సమ్మె, తమ డిమాండ్లపై అధికారులతో చర్చించనున్నారు. అధికారుల నుంచి వచ్చే స్పందనను బట్టి సమ్మెపై ప్రకటన రానుంది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే ఆర్టీసీ జేఏసీ నేతలు ఈరోజు లేబర్ కమిషనర్‌తో భేటీ కానుండటం రాజకీయంగా, పాలనాపరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే సమ్మెకు వెళ్లాలని కార్మిక సంఘాలు ప్రాథమికంగా నిర్ణయించాయి. కార్మికులు ఇప్పటికే సమ్మె నోటీసులు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక చర్చలకు పిలవకపోవడంపై జేఏసీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లేబర్ కమిషనర్‌తో జరిగే చర్చల అనంతరం సమ్మెపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. తమ డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గేదే లేదని, ఆర్టీసీని కాపాడుకోవడంతో పాటు కార్మికుల హక్కుల కోసం పోరాటం ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.కాగా, లేబర్ ఆఫీస్ వద్దకు కార్మికులందరూ చేరుకోవాలని ఆర్టీసీ జేఏసీ పిలుపునిచ్చింది. తమ డిమాండ్లపై గళమెత్తాలని కార్మికులకు సూచించింది. కార్మికులందరూ ఏకం కావాలని పిలుపు ఇచ్చింది. ఆర్టీసీ కార్మికుల వేతనాలు, సర్వీస్ సమస్యలు, బెనిఫిట్స్ వంటి అంశాలపై దీర్ఘ కాలంగా అసంతృప్తితో ఉన్నారు. సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల ఆందోళన తీవ్రత పెరుగుతోంది. ప్రభుత్వం తమ సమస్యలపై తక్షణ స్పందన ఇవ్వకపోతే సమ్మె తప్పదని జేఏసీ స్పష్టం చేసింది. ఇప్పటికే మార్చి 13వ తేదీన యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసినట్లు వెల్లడించింది. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన రాలేదని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సమ్మెకు వెళ్లాల్సి వస్తే దాని బాధ్యత ప్రభుత్వానిదేనని జేఏసీ నాయకులు హెచ్చరించారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే పరిస్థితి ఈ దశకు చేరిందని వారు పేర్కొన్నారు. దీంతో, ఈ చర్చలు సఫలమవుతాయా లేదా సమ్మెకు దారి తీస్తాయా అన్నది ఈ రోజు స్పష్టత రానుంది.

# అమీన్‌పూర్‌లో హైడ్రా మెగా ఆపరేషన్





హైదరాబాద్, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):

హైదరాబాద్‌లోని అమీన్‌పూర్ పరిధిలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియలో భాగంగా హైడ్రా చేపట్టిన భారీ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. శనివారం ఉదయం నుంచి ఆక్రమించిన స్థలాల్లో కట్టిన ఇళ్లను కూలగొట్టారు. సుమారు 861 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో ప్రధానంగా ముఖీమ్ , ఆయన సోదరుడు అజీమ్ అక్రమంగా నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఈ అక్రమ కట్టడం పక్కనే ఉన్న ఇతర అపార్టుమెంట్లకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అధికారులు అత్యంత జాగ్రత్తలు తీసుకున్నారు. ఇతర నివాసాలు ఉన్న ప్రాంతం కావడంతో, ఇతర భవనాల భద్రతను దృష్టిలో ఉంచుకుని కూల్చివేత ప్రక్రియను కాస్త నెమ్మదిగా, వ్యూహాత్మకంగా నిర్వహించారు.
గతంలో కబ్జాదారులు, భూమాఫియా ఆగడాలతో భయం భయంగా గడిపిన తమకు హైడ్రా రాకతో కొండంత భరోసా లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుల ఇళ్లను కూల్చబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీతో తమ ఆందోళనలన్నీ పటాపంచలయ్యాయని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడుతూ ఫెన్సింగ్ వేయడం అభినందనీయమని వారు పేర్కొంటున్నారు. అధికారులకు సహకరించడమే కాకుండా, వారు చేస్తున్న పనిని దగ్గరుండి చూస్తూ ప్రజలు అభినందనలు తెలుపుతున్నారని హైడ్రా తెలిపింది.

# మహిళా బిల్లుకు కౌంట్ డౌన్

న్యూఢిల్లీ

పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల చట్టసవరణ బిల్లుకు కౌంట్‌డౌన్ ప్రారంభమయ్యింది. ఈ చట్ట సవరణ బిల్లును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. "నారీ శక్తి వందన్ అధినియం పేరుతో మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణలపై చర్చించేందుకు వీలుగా ఈ నెల 16 నుంచి 18 వరకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు కూడా నడుం బిగించింది. దీంతో బడ్జెట్ సమావేశాల కాలాన్ని కూడా పొడిగించింది. దీనిని బట్టి చూస్తే ఈ బిల్లు విషయంలో ఎన్డీయే ప్రభుత్వం గట్టి పట్టుదలతో వుందని అర్థమైపోతుంది.ఇక? ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత కీలక అడుగు వేశారు. 'మహిళా రిజర్వేషన్ల చట్టం' అమలులో మద్దతును కోరుతూ ప్రధాని మోదీ లోక్ సభ, రాజ్యసభలోని అన్ని పార్టీల సభా నాయకులకు లేఖ రాశారు.ఏప్రిల్ 16 నుంచి నారీశక్తి వందన్ అధినియం" కి సంబంధించిన చారిత్రాత్మకమైన చర్చ పార్లమెంట్ లో జరగనుంది. ఈ ప్రత్యేక సమావేశం ద్వారా మన దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఓ సువర్ణావకాశం. అందరినీ కలుపుకుంటూ, సమిష్టిగా ముందుకు సాగాలన్న మన సంకల్పాన్ని పునరుద్ఘాటించే సందర్భం కూడా ఇదే. ఈ స్ఫూర్తి, ఉద్దేశంతోనే నేను మీకు లేఖ రాస్తున్నాను. ఈ చట్టం ఉద్దేశం, స్ఫూర్తి ఈ రెండింటిని పరిగణనలోకి తీసుకొని, ఈ బిల్లు సంపూర్ణంగా అమలులోకి రావాల్సిన సమయం ఆసన్నమైంది" అంటూ మోదీ ఆ లేఖలో వివరించారు.అంతేకాకం?డా 2029 లోకసభ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు కావడం అత్యంత అవసరమని ప్రధాని నొక్కి చెప్పారు. విస్తృతమైన సంప్రదింపుల తర్వాత, దేశ వ్యాప్తంగా నారీశక్తి వందన్ అధినియం అమలు చేయడానికి తగిన సమయం ఆసన్నమైందని తాము ఓ నిర్ణయానికి వచ్చామని ప్రధాని ఆ లేఖలో పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు మరియు శాసనసభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్ల అమలుతోనే నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని వివరించారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య సంస్థలకుకొత్త శక్తిని అందిస్తుందని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరుస్తుందన్నారు.తాము చేస్తున్న ఈ ప్రయత్నం పక్షపాత రాజకీయాలకు అతీతమైందని, ఓ ముందడుగు అని ప్రధాని అభివర్ణించారు. మహిళల కలలను సాకారం చే? దిశగా ఓ ప్రయత్నమని



అభివర్ణించారు. ఉభయ సభల పార్లమెంట్ సభ్యులు ఈ ప్రతిపాదనకు, బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని ప్రధాని అన్ని పక్షాలను కోరారు.ఈ సవరణను ఆమోదించడానికి మనమందరం ఏకతాటిపైకి రావాలనే ఉద్దేశంతో నేను ఈ లేఖను రాస్తున్నానని, ఈ విషయంపై పార్లమెంటులో అనేకమంది పార్లమెంటు సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే ఎంతో బాగుంటుంది మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఏ ఒక్క పార్టీకో లేదా ఏ ఒక్క వ్యక్తికో సంబంధించింది కాదని, వీటన్నింటికీ అతీతమైన సందర్భం అని మోదీ అభిప్రాయపడ్డారు.మహిళల పట్ల, అలాగే మన భవిష్యత్ తరాల పట్ల బాధ్యతను చాటిచెప్పాల్సిన సమయం ఇది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలనే ఆకాంక్షను అన్ని రాజకీయ పార్టీలూ ఎంతో కాలంగా వ్యక్తం చేస్తున్నందున, ఆ ఆశయాన్ని సాకారం చేయడానికి ఇదే సరైన సమయం," అని ప్రధాని వివరించారు.దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర పెంచడానికి రూపొందించినదే ఈ 'మహిళా రిజర్వేషన్ బిల్లు'. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం లోక్‌సభలో 542 సీట్లకు గాను.. 78 మంది మహిళా ఎంపీలుంటే.. రాజ్యసభలో 224 సీట్లలో 24 మంది మహిళలున్నారు. ఉభయసభల్లో మొత్తం 102 మంది మహిళా ఎంపీలున్నారు. ఈ లెక్కన చూస్తే.. పార్లమెంట్‌లో 13.3 శాతం మాత్రమే మహిళలున్నారు. ఈ సంఖ్యను 33 శాతానికి పెంచాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించారు.ఈ ఆలోచనకు దాదాపు 27 ఏళ్ల క్రితమే అంకురార్పణ జరిగింది. 1996లో హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలుత లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టింది. తర్వాత వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ ప్రవేశపెట్టినా ఈ బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. చివరకు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగ్‌లోనే ఉండిపోయింది.ఆపై 2014లో లోక్‌సభ రద్దు కావడంతో మరోసారి బిల్లు అడుగున పడిపోయింది. మరలా తొమ్మిదేళ్ల అనంతరం తాజాగా మరోసారి ఈ బిల్లు తెరమీదకొచ్చింది.

# సౌదీకి భారీగా పాకిస్తాన్ యుద్ధవిమానాలు

దుబాయ్

గత ఏడాది సెప్టెంబర్ లో పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య కీలక రక్షణ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా పాకిస్థాన్ సుమారు 13 వేల మంది సైనికులు, 10 నుంచి 18 వరకు ఫైటర్ జెట్లను సౌదీ అరేబియాకు పంపించింది. ఈ బలగాలను సౌదీ తూర్పు సెక్టార్‌లోని కింగ్ అబ్దులజీజ్ ఎయిర్ బేస్‌లో మోహరించారు.పాకిస్థాన్ సైనిక బృందం, ఫైటర్ జెట్లు, సహాయక ఎయిర్‌క్రాఫ్ట్‌లు శనివారం సౌదీ ఎయిర్ బేస్‌లో ల్యాండ్ అయినట్లు సౌదీ అరేబియా రక్షణ శాఖ వెల్లడించింది. ఇరు దేశాల సైన్యం మధ్య సమన్వయాన్ని పెంపొందించడానికి, కార్యాచరణ సన్నద్ధతను మెరుగుపర్చడం, భద్రతను, స్థిరత్వాన్ని పటిష్టం చేయడమే లక్ష్యంగా ఈ మోహరింపు చేపట్టినట్లు సౌదీ రక్షణ శాఖ వెల్లడించింది.ఓవైపు పాకిస్థాన్ యుద్ధ విమానాలు సౌదీలో దిగిన సమయంలోనే.. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు ఇస్లామాబాద్ ఆతిథ్యం ఇవ్వడం గమనార్హం. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ఓవైపు యుద్ధానికి ముగింపు పలకడానికి ప్రయత్నిస్తూనే.. పాక్ తన మిత్రదేశమైన సౌదీకి సైన్యాన్ని పంపించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇస్లామాద్‌లో జరిగిన చర్చలు విఫలమైనట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆదివారం ప్రకటించిన సంగతి తెలిసిందే.పాకిస్థాన్ సైన్యాన్ని తమ దేశానికి పంపించిన విషయాన్ని సౌదీ అరేబియా తాజాగా ప్రకటించినప్పటికీ.. పాకిస్థాన్ గత నెలలోనే ఎయిర్‌క్రాఫ్ట్‌లు, సైన్యాన్ని సౌదీకి పంపినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్ క్షిపణి నిరోధక వ్యవస్థలను కూడా సౌదీకి పంపించినట్లు చెబుతున్నారు. "కనీసం 13 వేల మంది పాకిస్థాన్ సైనికులు, 10 నుంచి 18 ఫైటర్ జెట్లు సౌదీ అరేబియాలో ల్యాండ్ అయ్యాయి. ఇప్పటికే అక్కడ 10 వేల మంది సైనికులు ఉన్నారు. ఇరు దేశాల మధ్య కుదిరిన రక్షణ ఒప్పందం ప్రకారం ఈ ఏర్పాటు జరిగింది" అని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుడు మహ్మా మెహదీ తెలిపారు.సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ గత ఏడాది రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశారు. నాటో తరహాలో ఉన్న ఈ ఒప్పందం ప్రకారం.. ఒక దేశంపై దాడి జరిగినా సరే.. దాన్ని రెండు దేశాలపై జరిగే దాడిగా పరిగణిస్తారు. పాకిస్థాన్ అణ్వస్త్ర దేశం కావడంతో.. ఈ ఒప్పందం ద్వారా సౌదీకి ప్రయోజనం చేకూరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముప్పు తీవ్రతను బట్టి పాకిస్థాన్ నుంచి అన్ని రకాల రక్షణ, సైనిక సాయాన్ని సౌదీ పొందే అవకాశం ఉంటుంది.1960ల నుంచే పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య రక్షణ సంబంధాలు ఉన్నాయి. యెమెన్‌లో ఈజిప్టు యుద్ధం సమయంలో పాకిస్థాన్ తన బలగాలను సౌదీకి పంపించింది. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడ్డాయి. ప్రస్తుతం ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకున్నాయి. ఈ పరిస్థితుల్లో సౌదీ, పాక్ రక్షణ ఒప్పందం వైపు అందరి దృష్టి మళ్లింది.

## భాగ్యనగరంలో భగ్గుమంటున్న ఎండలు




హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్)

వేసవి తాపం పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్ మహానగరంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27)లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం (ఏప్రిల్ 13) అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదైనట్లు టీజీఎస్పీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం 16:01 గంటలకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 4,381 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఇదే అత్యధిక వినియోగం కావడం గమనార్హం. గత నెల మార్చి 3, 2026న నమోదైన 4,421 మెగావాట్ల ఆల్ టైమ్ రికార్డు స్థాయి డిమాండ్‌కు ఈ గణాంకాలు చేరువలో ఉండటం నగరంలో పెరుగుతున్న ఏసీలు, కూలర్ల వాడకాన్ని సూచిస్తున్నాయి. డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ, గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఎండల తీవ్రత పెరిగి డిమాండ్ మరింత పెరిగినా, ఆ అవసరాలను తీర్చడానికి టీజీఎస్పీడీసీఎల్ పూర్తి సన్నద్ధంగా ఉందని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ నెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ అంతకుముందు రెండు రోజుల కంటే తక్కువగా నమోదు కావడం విశేషం. కేవలం నగర పరిధిలోనే వ్యాపార, నివాస సముదాయాల నుంచి విపరీతమైన ఒత్తిడి పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. విద్యుత్ వినియోగదారులు కూడా పీక్ అవర్లలో పొదుపు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## విలీనం, సంఘాల గుర్తింపు నా పరిధిలో లేవు



హైదరాబాద్, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్)

టీజీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం మరియు కార్మిక సంఘాల గుర్తింపు వంటి అంశాలు తన పరిధిలో లేవని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఆర్టీసీ సమ్మెపై కీలక వ్యాఖ్యలు చేశారు. విలీనం ప్రక్రియ ప్రస్తుతం కమిటీ పరిశీలనలో ఉందని, సమ్మెకు పిలుపునిచ్చిన అంశాల్లో కేవలం రెండు సమస్యలు మినహా మిగతా అన్నింటిపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్మికులు ఎవరూ ప్రేరేపిత సమ్మెలకు వెళ్లవద్దని, ఇప్పటికే పెండింగ్ డీఏలను విడుదల చేశామని, త్వరలోనే పీఆర్సీ అంశంపై కూడా సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 13 నుంచి 18 వరకు పోలీస్ మరియు రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'అరైవ్ – అలైవ్' (ూతీతీఱఴవ – ూశ్రీఱఴవ) కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. రవాణా నిబంధనలను కఠినతరం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే వారికి 'రహవీర్' అవార్డులతో సత్కరిస్తామని ప్రకటించారు. అలాగే ఆర్టీసీలో 30 ఏళ్ల సర్వీసులో ఒక్క ప్రమాదం కూడా చేయని డ్రైవర్లను సన్మానించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అన్ని జిల్లాల్లో సమీక్షలు నిర్వహించి, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## కేసీఆర్‌తో ప్రయాణం నా అదృష్టం

**ఆత్మగౌరవం కోసమే కాంగ్రెస్ వీడుతున్నా**
**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



హైదరాబాద్, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ ఉద్యమ నాయకుడిగా పదేళ్ల పాటు రైతులకు, బలహీన వర్గాల సంక్షేమానికి కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు మాజీ మంత్రి జీవన్ రెడ్డి. కేసీఆర్ తో కలిసి నడవడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో జరిగే కేసీఆర్ బహిరంగ సభ రాష్ట్ర రాజకీయాల్లోనే ఒక మైలురాయిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగిత్యాలలో మీడియాతో మాట్లాడిన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'నువ్వు ముసలిదానివి అయిపోయావ్.. నేను కొత్తగా వయసు దానిని తెచ్చుకుంటాననడం పద్ధతేనా? అంటూ కాంగ్రెస్ అధిష్టాన తీరుపై పరోక్షంగా నిప్పులు చెరిగారు జీవన్ రెడ్డి. నేను ముసలిదాన్నే కావచ్చు.. కానీ నేను మనిషిని కాదా? నాకు మనసు లేదా? జీవితకాలం కష్టపడి పార్టీని పెంచి పెద్ద చేస్తే.. ఇప్పుడు ముసలిదానివి అయ్యావని వయసు దానిని తెచ్చుకుంటానంటే ఎలా ఊరుకుంటాం?' అంటూ తన ఆవేదనను వెళ్లగక్కారు. నువ్వు ఇంకో వయసు దానిని తెచ్చుకుంటే.. నేను కూడా మరో ముసలోణ్ణి చూసుకుంటున్నాను అంటూ జీవన్ రెడ్డి చేసిన పోలిక ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఒకే కుటుంబంలా పనిచేశామని.. కానీ విధిలేని పరిస్థితుల్లో ఆత్మగౌరవం కోసమే కాంగ్రెస్ ను వీడాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు.

తీన్మార్

# అగ్నిప్రమాదాలు- అప్రమత్తత అత్యవసరం

అగ్ని వలన జరిగే ప్రమాదాలను అగ్ని ప్రమాదాలు అంటారు. ఇవి వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ మూడవ వారంలో వారం రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆస్పత్రులు, కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతారు. ఆర్టీసీ బస్టాండ్లు, పెట్రోల్ బంకులు, మార్టు, అపార్ట్మెంట్లు, పాఠశాలలు, ఫ్యాక్టరీల, గ్యాస్ సరఫరా కేంద్రాల వద్ద డెమో నిర్వహిస్తారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారు. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు... ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలు అందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతి క్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించ గలిగితే, ఎక్కువ నష్టం కలుగకుండా నివారించ వచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియచేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి. విద్యుదాఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాలవుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయి. ఎండా కాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా పెద్దపెద్ద అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్ట వచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు, అయోమయానికి గురికాకుండ ఉండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు. ఆసుపత్రులు, హోటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ, ముందు భాగంలో గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. అధిక నీటి సామర్థ్యం గల ట్యాంకులను అమర్చుకోవాలి. నీళ్ళు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలకు ఒకే స్టైయిర్ కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించటానికి మరో స్టెయిర్‌కేస్ సమకూర్చుకోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయోగించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం , వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయ బడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. అగ్ని ప్రమాదం సంభించినపుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారిని పిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించాలి. అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారు పడక, జాగ్రత్తగా వ్యవహరించాలి. దుస్తులకు నిప్పంటుకున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పు కోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి.

# అసమాన ప్రతిభాశాలి రాహుల్ సాంకృత్యాయన్



రాహుల్ సాంకృత్యాయన్ (1893 ఏప్రిల్ 9 – 1963 ఏప్రిల్ 14) అసమాన ప్రతిభాశాలి, ఆయన మేధస్సును కొలవడానికి ఏ కొలబద్ద సరి పోదంటే అతిశయోక్తి కాదేమో. కాలాలకు అతీతంగా యావత్ ప్రపంచ చరిత్రలోనే స్వయం కృషితో మహా పండితుడైన వ్యక్తి మరొకరు లేరని మేధావులు భావించడాన్ని బట్టి ఆయన ప్రతిభ తేట తెల్లం అవుతున్నది. ముప్పైకి పైగా భాషలు, వాటి యాసలు నేర్చుకుని అధికారికంగా చదువుకోక పోయినా విశ్వ విద్యాలయాల్లో బోధించే స్థాయికి ఎదగడాన్ని బట్టి ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. రాహుల్ సాంకృత్యాయన్ నిరంతర లోక సంచారిగా పేరొంది, 45 సంవత్సరాల పాటు యాత్రలలోనే గడిపారు. లోతైన తాత్త్విక చింతన కలిగిన సాంకృత్యాయన్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి బౌద్ధ భిక్షువుగా మారి అనంతరం మార్క్సిస్ట్ సోషలిస్టుగా పరివర్తన చెందారు. సాంకృత్యాయన్ భారత జాతీయోద్యమంలో కూడా కృషి చేశారు. జాతీయోద్యమానికి అనుకూలంగా, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు, ప్రసంగాలు చేసినందుకు 3సంవత్సరాల కారాగార శిక్షను అనుభవించారు. 1940వ దశకం ప్రారంభంలో ఆయన పూర్తిగా భౌతికవాద భావాలను స్వీకరించి, కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యునిగా చేరి, జీవితాంతం కమ్యూనిస్ట్‌గా ఉన్నారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా ఆయన అనేక రైతు పోరాటాలకు నాయకత్వం వహించారు. పురాతన బౌద్ధ గ్రంథాలను వెలికితీసి, వాటిని అనువాదం చేసి, ప్రపంచానికి తెలియపరచటంలో రాహుల్ అపారమైన కృషిని బౌద్ధులు ఎంతో విలువైనదిగా గుర్తించారు. యునైటెడ్ ప్రావిన్సెస్ (యూపీ) రాష్ట్రంలోని అజామ్‌గఢ్ జిల్లాలో 1893 ఏప్రిల్ 9లో సనాతన ధర్మాన్ని పాటించే బ్రాహ్మణ కుటుంబంలో కేదార్‌నాథ్ పాండే జన్మించారు. బౌద్ధాన్ని స్వీకరించాక, తన పేరును రాహుల్ సాంకృత్యాయన్‌గా మార్చు కున్నారు. ప్రాథమిక విద్య ఉర్దూ మాధ్యమంలో చదివారు. తొమ్మిదేళ్లప్పుడే ప్రపంచం ఏమిటో చూడాలని ఇంట్లోంచి పారిపోయాడు సాంకృత్యాయన్. 8వ తరగతి తోనే అతని చదువు ఆగిపోయింది. కాశీ విద్యాపీఠ్‌లో సంస్కృతం నేర్చుకున్నాడు. ఆర్యసమాజంలో చేరి హిందూమత వ్యాప్తికి కొన్నాళ్లు కృషి చేశాడు. ఆయన నిత్యసంచారిగా వేలాది కిలోమీటర్లు కాలినడకన చుట్టివచ్చారు. మూడు బౌద్ధ వేదాలనూ జీర్ణించుకుని త్రిపిటకాచార్య అయ్యారు. టిబెట్, శ్రీలంక, ఇరాన్, చైనా, అప్పటి సోవియట్ రష్యా... ఎక్కడ తిరిగితే అక్కడి భాష నేర్చుకున్నారు. అరబిక్, భోజ్‌పురి, ఫ్రెంచ్, హిందీ, కన్నడం, మైథిలి, నేపాలీ, పాళీ, పర్షియన్, రష్యన్, రాజస్థానీ, సింహళీస్, తమిళం, ఉర్దూ లాంటి భాషలు అవలీలగా ఆయన నేర్చుకుని పట్టు సాధించారు. పదమూడో శతాబ్దంలో నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలను భక్తియార్ ఖిల్జీ ధ్వంసం చేసినప్పుడు బౌద్ధ భిక్షువులు పవిత్రమైన గ్రంథాలతో పారి పోయారనీ, ఆ విలువైన సంస్కృత పుస్తకాల్ని టిబెట్‌లోని ఆరామాల్లో భద్రపరిచి వుంచారనీ ప్రచారంలో ఉంది. అయితే, ఆరు వందల ఏళ్లుగా వాటిల్లో ఏముందో చూసినవారు లేరు. సాంకృత్యాయన్ వాటికోసం అన్వేషిస్తూ, దారి కూడా సరిగాలేని కొండల్లో నడుస్తూ, కాశ్మీర్, లడఖ్, కార్గిల్ మీదుగా టిబెట్ వెళ్లారు. అక్కడ పుస్తకాలైతే లభించాయిగానీ అవి సంస్కృతంలో లేవు. అన్నీ భోటి భాషలో ఉన్నాయి. రాహుల్ కంచర గాడిదల మీద వాటిని తరలించు కొచ్చారు. ఆ గ్రంథాలన్నీ పాట్నా మ్యూజియంలో ఉన్నాయిప్పుడు. మరో మూడుసార్లు టిబెట్ వెళ్లి, టిబెటన్ నేర్చుకుని, దాని వ్యాకరణ పుస్తకాలు రాశారు. టిబెటన్–హిందీ నిఘంటువు కూర్చారు. నాటి సోవియట్ యూనియన్‌లోని అనేక రిపబ్లిక్కులలో ఆయన విస్తృతంగా పర్యటించి, సంస్కృతం, పాళీ భాషలో లిఖించబడిన అనేక శాసనాలను, రాతి ఫలకాలనూ కనుగొన్నారు. భారతదేశంలోనూ, నేపాల్, హిమాలయ సానువులలోనూ, టిబెట్ లోనే కాకుండా ఆయన మంగోలియా, ఆఫ్ఘనిస్తాన్ ఆదిగా అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. తన యాత్రలో భాగంగా అరుదైన "కాన్జూర్, టాన్జూర్, గ్రంథాలను కొన్నాడు 130 వర్ణ చిత్రాలు 1600 కు పైగా వ్రాత ప్రతులు సేకరించారు. యాత్రికుడు యుఁవాన్ త్స్యాంగ్ తర్వాత ఇంత భారీగా సేకరించిన వారెవరు లేరని చరిత్ర కారుల అంచనా. 70 సంవత్సరాల వయస్సులో మరణించే సమయానికి, ఆయన దాదాపు 140 పుస్తకాలు రాశారు. జీవితంలో మొత్తం జ్ఞాపకశక్తిని కోల్పోయారు. వందలాది పుస్తకాలు కూడా కంఠోపాఠంగా కలిగిన మహా జ్ఞాని, విజ్ఞాన ఖని చివరి రోజుల్లో తన పేరేమిటో తనే చెప్పుకోలేని మతిమరుపు లోకి జారి పోయారు. 1963 ఏప్రిల్ 14లో శ్రీలంకలో ఆచార్యుడుగా పనిచేస్తూ, ఆయన అంతిమ శ్వాస విడిచారు. ఆయన స్మృతి చిహ్నం డార్జిలింగ్ నగరంలో బౌద్ధమత పద్ధతిలో నిర్మించబడింది. 1958లో సాహిత్య అకాడమీ పురస్కారం, 1963లో పద్మభూషణ్ బిరుదులు ఆయనకు లభించాయి.

# వీడుతున్న ఆక్రమణల చెర



గ్రేటర్ హైదరాబాద్‌లో ఇటీవల ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రభుత్వం కొరడా ఝుళిపించడంతో నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విస్తరిస్తున్న నగరానికి తగ్గట్టుగా రహదారులు లేకపోవడంతోపాటు భారీగా వాహనాల పెరుగుదలతో హైదరాబాద్ ట్రాఫిక్ పద్మవ్యూహంలో ప్రజలు నిత్యం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగర ప్రజలు రద్దీ సమయాల్లో రోడ్లపై నడవాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్న కొన్ని ఫుట్‌పాత్‌లను కూడా చిరు, బడా వ్యాపారస్థులు కబ్జాలు చేయడంతో ఏమీ చేయలేక రోడ్డుపైనే నడుస్తూ ప్రయాణికులు ప్రమాదాలకు గురైన ఘటనలు నగరంలో అనేకం ఉన్నాయి. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం నగరం నలువైపులా ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాల తొలగింపుకు నడుం కట్టడంతో ప్రజలకు భారీ ఉపశమనం లభించనుంది. రాజకీయంగా, అధికారికంగా ఏ రూపంలోనైనా ఒత్తిడిలు వచ్చినా కబ్జాదారుల కబంధహస్తాల నుండి ఫుట్‌పాత్‌లను విముక్తి చేయాలి. వేగంగా అభివృద్ధి చెందుతూ మెట్రో నగరంగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ ఐటి, మౌలిక వసతులు, రహదారుల విస్తరణలో ముందంజలో ఉన్నా ఫుట్‌పాత్‌ల పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నాయి. దీంతో వేగంగా వెళ్లే వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా వృ ద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో నడక ప్రమాదకరంగా మారిపోయింది. ప్రతి సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌లో వెయ్యికిపైగా పాదచారుల ప్రమాదాలు నమోదవుతున్నాయి. ఉదాహరణకు 2024 గణాంకాలు పరిశీలిస్తే 400 మంది పాదచారులు ప్రమాదంలో మృతి చెందారు. 775 మంది గాయపడ్డారు. అంటే నగరంలో రోజుకు సుమారు 30 మందికిపైగా పాదచారులు రోడ్డు ప్రమాదాల బారీనపడుతున్నారు. ఈ ప్రమాదాలు అత్యధికంగా ఫుట్‌పాత్ సమస్యలతో ముడిపడి ఉండడం గమనార్హం. నగరంలో రహదారుల, ఫుట్‌పాత్ సమస్యలు పరిష్కరించడంలో భాగంగా వాటిని అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సుమారు మూడు వేల కోట్లకుపైగా రూపాయలు వెచ్చించి వెయ్యి కిలోమీటర్లకు పైగా రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా బిటి, సిసి రోడ్లతోపాటు ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్లు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 700 కిలోమీటర్లకుపైగా రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు, అదనంగా 200 కిలోమీటర్లకుపైగా రోడ్లను ఎఫ్‌డిఆర్ సాంకేతికతతో పునర్నిర్మాణం చేయనున్నారు. వీటితోపాటు నగరం మొత్తం ఫుట్‌పాత్‌లను కూడా సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిహెచ్‌ఎంసి 2025 –26లో గుంతలు పూడ్చడంతోపాటు ట్రాఫిక్ భద్రతా చర్యలను చేపట్టింది. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు 24 లింక్ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ. 487 కోట్ల ప్రణాళికను అమలు చేస్తున్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యలకు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న కట్టడాలపై కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైన జిహెచ్‌ఎంసి ప్రతి వారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా నగరం నలువైపులా అక్రమ కట్టడాలను తొలగించేందుకు ముందుకొచ్చిన జిహెచ్‌ఎంసి ఏప్రిల్ 4వ తేదీన హైడ్రా, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకొని ఆరు జోన్ల పరిధిలోని 798 నిర్మాణాలను నేలమట్టం చేసింది. తొలగించిన వాటిలో 340 పూర్తిస్థాయి, 458 తాత్కాలిక నిర్మాణాలు న్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సున్నితమైన పాతబస్తీతోపాటు కొన్ని చోట్ల ఉద్రిక్తతలు నెలకొన్నా అధికారులు సమన్వయంతో విజయవంతంగా అక్రమాలను తొలగించారు. ఇదే తరహాలో ఇకపై నగరవ్యాప్తంగా ప్రతివారం ఏదో ఒక ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని జిహెచ్‌ఎంసి అధికారులు ప్రకటించడంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నా యి. నగర ప్రజలు ఇదే కోరుకుంటున్నారు. చారిత్రాత్మకమైన హైదరాబాద్ నగరం లోని ప్రధాన మార్గాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు పలు సమస్యల కు కారణాలవుతున్నాయి. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకట్టుకునే చార్మినార్ పరిసరాల్లో వ్యాపారస్థులు పూర్తిగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పర్యాటకులు నడవలేని పరిస్థితి నెలకొంది. దక్షిణ హైదరాబాద్‌కు ముఖద్వారమయిన మూసీనదిపై నాటి నిజాం కాలంలో నిర్మించిన వంతెన ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ప్రస్తుతం పాతబస్తీలో మూసీ నదిపై ఉన్న వంతెనలన్నింటిలో 'నయాపూల్'గా పిలువబడే వంతెన ఎత్తైనది. భారీ వాహనాల ప్రయాణానికి అనువుగా నిర్మించిన ఈ వంతెనపై రిక్షాలు, సైకిళ్ల కోసం, పాదచారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. 2000 సంవత్సరం వరకు ఇదే తరహాలో ఉండేది. అయితే దురదృష్టవశాత్తు ఇప్పుడు భారీ వాహనాల మార్గం మినహాయించి రిక్షాలు, సైకిళ్లు, పాదచారులకోసం ఏర్పాటు చేసిన మార్గాలు పూర్తిగా తోపుడు బండ్లతో నిండిపోతున్నాయి. అక్కడ పాదచారులు భారీ వాహనాలు నడిచే మార్గంలోనే నడవాల్సి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇదే మార్గంలో ముందుకెళ్తే చారిత్రాత్మక కట్టడాలున్న మదీనా, గుల్జర్‌హౌజ్, చార్మినార్ మరింత క్లిష్ట పరిస్థితులున్నాయి. పాతబస్తీలోనే కాదు నగరం నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్, కోఠి, నాంపల్లి, చిక్కడపల్లి, మెహిదీపట్నం, ఆరాంఘర్, పంజాగుట్ట, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ వంటి పలు ప్రధాన మార్గాల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా స్పందించకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిలో తప్పు చేస్తున్నామనే స్పందనలేకపోవడం, రాజకీయ ప్రయోజనాలతో వారికి మద్దతుగా నేతలు బలప్రదర్శన చేస్తూ అధికారులను అడ్డుకోవడం దురదృ ష్టకరం. ఇటీవల నగరంలోని ఆరు జోన్లలో అక్రమాలను తొల గిస్తుంటే పాతబస్తీతోపాటు కొన్ని చోట్ల నాయకులు అడ్డుకోవ డానికి ప్రయత్నించినా అధికారులు వెనక్కి తగ్గకుండా పని పూర్తిచేయడం అభినందనీయం. ఎంతోకాలం గా అక్కడ వ్యాపారాలు చేస్తున్నారని, వారందరూ చిరు వ్యాపారులు అంటూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారికి మద్దతుగా నిలిచే వారు వాదిస్తున్నారు. దీర్ఘకాలికంగా వారక్కడ ఆక్రమించి ప్రజ లను ఇబ్బందుల పాలుచేస్తున్నారనే ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంటుందనే వాస్తవాన్ని వారు గ్రహించాలి. చిరువ్యాపా రుల జీనవోపాధి దెబ్బతినడం బాధా కరమే. ఇలాంటి వారి కోసం అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా ప్రత్యామ్నాయం ఆలోచించి చర్యలు తీసుకోవాలి. మరోవైపు ప్రధాన కూడళ్లలో బడా వ్యాపారస్థులు కూడా తమ దుకాణాలకు ముందున్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి లావాదేవీ లు నిర్వహిస్తున్న ప్రదేశాలు నగరంలో కోకొల్లలు. మరికొన్ని చోట్ల పెద్ద వ్యాపారస్థులే వారి మనుషులతో ఫుట్‌పాత్‌లను ఆక్రమింపజేసి వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. వాస్తవాలు ఇలా ఉంటే చిరువ్యాపారులకు అన్యాయం జరుగుతుందంటూ రాజకీయ నేతలు అధికారులపై ఒత్తిడి తేవడం ప్రజలను ఇబ్బందుల పాలుజేయడమే. విస్తరిస్తున్న హైదరాబాద్ మహాన గరానికి అనుగుణంగా రహదారులు, ఫుట్‌పాత్ అభివృద్ధి కోసం ఆలస్యంగానైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై కబ్జాల తొలగింపు కార్యక్రమాన్ని ఒక్క రోజుకే పరిమితం చేసి చేతులు దులుపుకోకుండా ఆ అక్రమ కట్టడాలపై పర్యవేక్షణ నిత్యం కొనసాగాలి. తొలగించిన కట్టడాలను పాతబస్తీ వంటి కొన్ని ప్రాంతాల్లో తిరిగి నిర్మిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటిని అరికడితేనే ప్రభుత్వ లక్ష్యం సఫలమవు తుంది. ఎలాం టి ఒత్తిడిలకు లొంగకుండా పాతబస్తీతో సహా నగరంలోని నలుమూలల రహదారులపై అక్రమంగా వెలిసిన కట్టడాలన్నిం టినీ తొలగించాలని నగరవాసులు అందరూ కోరుకుంటు న్నారు. ఆక్రమణల తొలగింపుతో గ్రేటర్ రహదారులకు మహ ర్దశ ఏర్పడుతుందని ఆశిస్తున్నారు. ఇలాంటి బహత్కరమైన కార్యమాలను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా కొనసాగిస్తే కబ్జాదారులు మరోసారి అక్రమాలు చేయడానికి సాహసించరు.

# ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

## జన గణన రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి

**ములుగు జిల్లా, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):**

జన గణనలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జన గణన తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఇండ్ల గణన కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11వ తేదీ నుండి నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఇండ్ల జాబితా బ్లాక్ లను రూపొందించాలని, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఇండ్ల గణన, జనగణన జాబితా ప్రకారం అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో దోహదపడతాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణన కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన




కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని తెలిపారు. జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల సమన్వయంతో ఇండ్ల గణన ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు నియమించబడిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ఎండలు పట్ల జాగ్రత్తగా ఉండాలి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):**

రోజు రోజుకు పెరుగుతున్న ఎండలు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎండలు బారి నుండి రక్షణపై సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ మన జిల్లాకు ఆరంజ్ జోన్ ప్రకటించినట్లు తెలిపారు. వేసవిలో ప్రజలు ఎండలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య రక్షణ చర్యలు పాటించాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయాల్లో ప్రజలు ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ఉండాలని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల మధ్య ఎండ అధికంగా ఉంటుందని ప్రజలు బయటికి వెళ్లొద్దని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడ దెబ్బబారిన పడే అవకశాలున్నాయని, తద్వారా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వడదెబ్బకు గురైతే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎండల్లో చిన్నారులు, వయోవృద్ధులతో ప్రయాణం చేయొద్దని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇంటి నుండి బయటికి వస్తే తలకు ఎండ తగలకుండా గొడుగు, కండువా, టోపితో కవరు చేసుకోవాలన్నారు. తరచుగా మంచినీళ్లు త్రాగాలని సూచించారు. మజ్జిగ,



నిమ్మరసం, ఉప్పు పంచదార కలిపిన ద్రావణం, ఓఆరెస్ తీసుకోవాలని తెలిపారు. వదులుగా ఉన్న కాటన్ దుస్తువులు ధరించాలని తెలిపారు. ఎండలు వల్ల చర్మంపై ఎర్రటి దద్దుర్లు, పొడిబారడం లాంటి మార్పులను గమనించాలని తెలిపారు. వేడి వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్ల నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయక తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్య సేవలు పొందాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు 108 కు ఫోన్ చేయాలని అన్నారు. నిల్వ ఉన్న ఆహారం, వేపుళ్లు, ఆరు బయట ఆహార పదార్థాలుకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులు కూలీలు ఉదయం 6 నుండి 11, సాయంత్రం 4 నుండి 6 గంటలు వరకు పనులు చేపించాలని, పనులు జరుతున్న ప్రదేశాల్లో రక్షణ, జాగ్రత్తలు పాటించేలా షేడ్ నెట్స్, ఓఅర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఎండదెబ్బ తగలకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ప్రోగ్రాం అధికారి డా దేవేందర్, ఆర్డిఓ హరికృష్ణ, డిఆర్డిఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గండి రామారం ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయాలి

## స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హనుమకొండ జిల్లా, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):**

ఎట్టి పరిస్థితుల్లో జూన్ 30నాటికి గండి రామారం లిఫ్ట్ -1 పనులు పూర్తి చేసి వర్షాకాలం వరకు వేలేరు, చిల్పూర్ మండలాల రైతులకు సాగు నీరు అందించే విధంగా అధికారులు పనులు పూర్తి చేయాలని చేయలని మాజీ మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హన్మకొండ చింతగట్టు క్యాంప్ లోని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో గండి రామారం ఎత్తిపోతల పథకం పనులపై నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ సుధీర్ కలిసి అధికారులు, కాంట్రాక్టర్లు, చిల్పూర్, వేలేరు మండలాల సర్పంచులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. గండి రామారం ఎత్తిపోతల పథకం పనులు ఎలా జరుగుతున్నాయి...? ఏమైనా అడ్డంకులు ఉన్నాయా..? అనే వివరాలను అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులతో అదనపు చెరువులు ఏమైనా ఉన్నాయా...? వాటిని నింపేందుకు ఫీజుబులిటీ ఎంత వరకు ఉంది అనే సమాచారాన్ని తీసుకున్నారు. లిఫ్ట్ -1కాలువ ఏ ఏ గ్రామాల నుండి ఏ ఏ చెరువులు నిండుతున్నాయో క్షేత్ర స్థాయిలో మ్యాప్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గండి రామారం ఎత్తిపోతల పథకం లోని లిఫ్ట్ -1పనులను 30జూన్ 2026నాటికి పూర్తి చేసి వర్షాకాలం వరకు చెరువులు నింపి రైతులకు సాగు నీరు అందించాలని నీటి పారుదల శాఖ అధికారులను



ఆదేశించారు. లిఫ్ట్ -1 పైన వేలేరు, చిల్పూర్ మండలాల రైతులు నుండి డిమాండ్ ఎక్కువగా ఉందని తెలిపారు. లిఫ్ట్ -1పనులు పూర్తి చేసేందుకు ఏమైనా అడ్డంకులు ఉన్నాయా అని కాంట్రాక్టర్లను అడిగారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో అదనపు చెరువులు, కుంటలు నింపేందుకు రైతుల నుండి వచ్చిన విజ్ఞప్తులకు వెంటనే ఎస్టిమేషన్లు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అన్నారు. అధికారులు వారానికి రెండు సార్లు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించాలని అధిక ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేయించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో 30 జూన్ 2026 వరకు లిఫ్ట్ -1పనులు పూర్తి కావాలని జులై మొదటి వారంలో ప్రారంభోత్సవం చేసుకోవాలని ఈ డెడ్ లైన్ లో ఏవిధమైన మార్పు ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల చీఫ్ ఇంజనీర్ సుధీర్, ఎస్ఈ సీతారాం, డిఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు, చిల్పూర్, వేలేరు మండలాల సర్పంచులు, ఇతర నాయకులు, కార్యకర్తలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు గ్రామాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు జిల్లా, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):**




ములుగు మండలం రాయని గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు, సర్వాపురం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ సాయంత్రం 6 గంటలకు, మంగపేట మండలం రాజుపేట గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ లో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు, మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యం లో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమక్షంలో ములుగు మండలంలోని రాయినిగూడెం సర్వపూర్, మంగపేట మండలం రాజుపేట మల్లూరు గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, నాలుగు గ్రామాలకు చెందిన ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్ పి, డి ఎఫ్ ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖ ల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధత మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

## ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

జన గణన రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి



**మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):**

జన గణనలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జన గణన తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఇండ్ల గణన కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11వ తేదీ నుండి నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఇండ్ల జాబితా బ్లాక్ లను రూపొందించాలని, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఇండ్ల గణన, జనగణన జాబితా ప్రకారం అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో దోహదపడతాయని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరు కాగా, వీడియో కాన్ఫరెన్స్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణన కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని తెలిపారు. జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల సమన్వయంతో ఇండ్ల గణన ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు నియమించబడిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, సిపిఓ శ్రీనివాసరావు, ఎస్ఓ అశోక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలోని భారీ అగ్నిప్రమాదం

**నిమిషాల వ్యవధిలోనే ఎగసిపడ్డ మంటలు**

**పరిసర ప్రాంతాలన్నీ కామ్మేసిన దట్టమైన పొగ**

**హనుమకొండ జిల్లా, ఏప్రిల్ 13 (తీన్మార్ న్యూస్):**



హనుమకొండలోని కిషన్పురంలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక పాత ఇనుప సామాను దుకాణంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు అంటుకున్నాయి. నిమిషాల వ్యవధిలోనే అగ్నికీలలు భారీగా ఎగసిపడటంతో పరిసర ప్రాంతాలన్నీ దట్టమైన పొగతో నిండిపోయాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం మూడు ఫైర్ ఇంజన్లతో సిబ్బంది శ్రమిస్తున్నప్పటికీ, మంటలు ఇంకా అదుపులోకి రాలేదు. ప్రమాదం జరిగిన సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రాణ నష్టం తప్పిందని అధికారులు తెలిపారు. అయితే, ఈ ప్రాంతం చుట్టుపక్కల నివాస గృహాలు ఎక్కువగా ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మంటలు పక్కన ఇళ్లకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# క్షేమంగా ఇంటికి రండి..
# మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తుంది





**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్,**

**వరంగల్** : వాహనాలపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబందనలు పాటిస్తూ క్షేమంగా ఇంటి రావాలని..మీ రాక కోసం మీ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో రోడ్డు భద్రతతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకుగా నేటి నుండి ఈ నెల 18 తేది వరకు చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమములో భాగంగా ఎల్కతుర్తి మండలం చింతల్ పల్లి గ్రామంలో ఎల్కతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధి పాల్గోన్నారు. ఈ సందర్భంగా చింతల్ పల్లి గ్రామంలో ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించే విధంగా వాహన దారులకు అవగాహన కల్పించి రీతిలో ఎర్పాటు చేసిన బైక్ ర్యాలీ వరంగల్ పోలీస్ కమిషనర్, సెంటర్ జోన్ డిసిపి ధార కవిత, స్థానిక పోలీస్ అధికారులు గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారులతో బైక్ ర్యాలీలో పాల్గోని గ్రామస్తులను ఉత్తేజపరిచారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాల యము ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు పోలీస్ కమిషనర్ పాల్గోని గ్రామస్తులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా నడపాల్సి వుంటుందని ముందుగా వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపటంతో పాటు, సెల్ఫోన్లో మాట్లాడుతూ ప్రయాణించడం ప్రమాదకరమని, ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, హెల్మెట్ ధరించి వాహనం నడపటం ద్వారా ప్రమాదాలకు గురైనప్పుడు ప్రమాద భారిన పడకుండా హెల్మెట్తో రక్షించబడుతారని, అలాగే యువత అతివేగంగా వాహనాలను నడిపి మృత్యువాత పడవద్దని రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఈ రోడ్డు ప్రమాదాలు ఎంతో మంది తల్లిదండ్రులకు కన్నీళ్ళకు కారణమవుతున్నాయని ప్రతి వాహనదారుడు జాగ్రత్తగా వాహనంగా నడపటంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగివుండటంతో పాటు వాటిని అచరించాలని సిపి తెలియజేసారు. అనంతరం చింతల్ పల్లి గ్రామంలోని వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి రావాలని లేదంటే గ్రామంలో ప్రవేశం లేదని గ్రామ సభలో తీర్మానం చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా గ్రామస్తులకు హెల్మెట్లను పంపిణీలు చేసారు. ఈ కార్యక్రమములో కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, కాజీపేట్, హసన్పర్తి ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, చేరాలు, ఎల్కతుర్తి, ముల్కనూర్ ఎస్.ఐలు ప్రవీణ్ కుమార్, రాజు, గ్రామ సర్పంచ్ రజితా రవీందర్, మార్కెట్ చైర్మన్ సంతాజీతో ఇతర పోలీస్ అధికారులు, గ్రామస్తులు పాల్గోన్నారు.

## జగన్నాధపురం రహదారి వెడల్పు చేయడంలో జాప్యమేలా

**50 అడుగుల రోడ్డు 40 అడుగులకు ఎలా మారుతుంది ?**

**డిజైన్ మార్పు ఎమ్మెల్యేకు తెలుసా ?**

**అధికారుల సూచనలను వ్యాపారులు బేకాతరు చేస్తున్నారా!**

**అధికారులకు ముడుపులు అందడంతోనే రహదారి డిజైన్ మారిందా ?**



**భద్రాద్రి** : భద్రాద్రి జిల్లా పరిధిలోని ములకలపల్లి మండల పరిధిలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉన్న జగన్నాధపురంలో జాతీయ రహదారి వెడల్పు తగ్గించాలన్న ఆలోచన వెనుక రహస్యమేమిటో అర్థం కాక జగన్నాధపురం ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ఆర్ అండ్ బి, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారుల సూచనలను రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార వర్గాలు బేకాతరు చేస్తున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల 5వ తేదీన ఆర్ అండ్ బి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, పోలీస్ శాఖల అధికారులు వ్యాపార కూడలిగా ఉన్న జగన్నాధపురం గ్రామం వద్ద 50 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే నెల 15 రోజులు గడుస్తున్నప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో పట్ల పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కిరువైపుల బడా వ్యాపారుల సముదాయాలు ఉండటం వల్లనే అధికారులు నోరు మెదపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆనాడు 50 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాల్సిందేనని ప్రజల సమక్షంలోనే ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ఇచ్చిన గడువు దాటిపోయినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు తమ భవన సముదాయాలను నేటికి తగ్గించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కొత్తగూడెం నుంచి భద్రాచలం జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న దమ్మపేట క్రాస్ రోడ్డు నుండి అశ్వరావుపేట వద్ద గల మందలపల్లి జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. అయినా నెల 15 రోజులు అవుతున్నప్పటికీ వ్యాపారులకిచ్చిన గడువుదాటి పైన అధికారం నోరు మెదపకపోవడం ఏమిటని సర్వత్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పనులు నేటికీ ప్రారంభం కాకపోగా వ్యాపార కూడలిగా ఉన్న జగన్నాధపురం లో ఆనాడు 50 అడుగులు ఉండాల్సిందే అని స్పష్టం చేసిన అధికారులు, నేడు 40 అడుగులు వెడల్పు ఉంటే సరిపోతుందని అంటున్నట్లు తెలుస్తోంది. వ్యాపారు కూడలిగా ఉన్న ఆ గ్రామంలో ప్రధాన రహదారిని 10 అడుగులు తగ్గించినందుకు అధికారులకు పెద్ద ఎత్తున ముడుపు అందాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఎంతవరకు సమంజసమో అధికారులు ఎవ్వరికి వారు ప్రశ్నించుకోవాల్సి ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రోడ్డు వెడల్పు తగ్గించాలనే ప్రతిపాదన అశ్వరావుపేట ఎమ్మెల్యే దృష్టిలో ఉందా ? లేక సంబంధిత అధికారులకు ముడుపులు ఏమైనా అందాయ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు వెడల్పు 50 అడుగులా! 40 అడుగుల అన్న సమస్యను పక్కనపెట్టి పన్నులు ప్రారంభించాల్సిందేనంటున్న ఆ గ్రామ ప్రజలు. ఇప్పటికైనా పనులు ప్రారంభిస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్'
# ప్రాణాలను నిర్లక్ష్యం చేయకండి

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ చిత్రా మిశ్రా,సిపి గౌస్ ఆలం**

**కరీంనగర్** : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ మరియు రవాణా శాఖల సమన్వయంతో తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.చట్టాలను కఠినంగా అమలు చేయాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లిముఖ్య అతిథి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాలు పేద, ధనిక అనే తేడా లేకుండా అందరినీ దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.డ్రంకన్ డ్రైవ్లో ఎవరైనా పట్టుబడితే రికమండేషన్ కోసం నాకు ఫోన్ చేయవద్దు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం క్షేమంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



గ్రామసభల్లో భద్రతపై చర్చించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రాజిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాల వల్ల ఛిన్నాభిన్నమైన కుటుంబాల గాథలు వింటే మనసు కలచివేస్తోందని అన్నారు. సర్పంచులు తమ గ్రామసభల్లో రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా చర్చించాలని, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ వంటి ఏర్పాట్లపై శ్రద్ధ వహించాలని సూచించారు.హెల్మెట్ ధరించడం తప్పనిసరి: సిపి గౌస్ ఆలంసిపి గౌష్ ఆలం మాట్లాడుతూ. జిల్లాలో గతేడాది 200 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, అందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం మరణాలకు ప్రధాన కారణాలన్నారు. పోలీసుల చర్యల వల్ల ప్రమాదాల రేటు 17 శాతం తగ్గిందని, ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల బహుమతి ఇస్తుందని తెలిపారు. 'రహ వీర్' పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ. 1.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్స అందు బాటులో ఉందని వివరించారు.కన్నీళ్లు పెట్టించిన బాధితుల గాథలు:ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల్లో తమ కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధితులు స్టేజీపై తమ ఆవేదనను పంచుకున్నారు. వారి మాటలు సభికులను కంటతడి పెట్టించాయి. గ్రామ సర్పంచ్ శ్వేత మాట్లాడుతూ, తమ గ్రామాన్ని ఈ కార్యక్రమానికి ఎంచుకున్నందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసుశాఖ తరుపున, ఎమ్మెల్యే గారి చేతులమీదుగా పలువురికి హెల్మెట్లను అందజేశారు. అంతేకాకుండా స్థానికులకు, డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు, సర్పంచులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మలుపులు తిరుగుతున్న మంగ్లీ కేసు

**హైదరాబాద్** : సింగర్ మంగ్లీపై ఫిర్యాదు చేసేందుకు లాయర్ సుబ్బారావు పంజాగుట్ట పోలీస్ స్టేషన్కు వెళ్లగా హైడ్రామా చోటుచేసుకుంది. ఆల్కహాల్ తాగి వచ్చాడని అనుమానంతో సుబ్బారావుకు పంజాగుట్ట సీఐ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయించారు. రీడింగ్ 27 పాయింట్లు రాగా, మోతాదులోపు ఆల్కహాల్ తీసుకున్నట్టు నిర్ధారణ అయింది. అయితే తాను రాత్రి మద్యం సేవిస్తే ఉదయం పీఎస్కు వచ్చిన తనకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయడం ఏంటని లాయర్ సుబ్బారావు పోలీసులను ప్రశ్నించారు. తనను అవమానించి, కేసు తప్పుదోవ పట్టించేందుకే పోలీసులు ఇలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తానేమైనా డ్రంక్ చేసి వాహనం నడిపానా ఏంటి.. కేవలం ఫిర్యాదు చేయడానికి కామన్ మ్యాన్లా పీఎస్కు వచ్చిన తనతో పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. తనపై మంగ్లీ చేసిన ఆరోపణలకు ఆధారం చూపించాలని డిమాండ్ చేశారు. తనపై నిరాధార ఆరోపణలను చేయడంతో ఎంతో మందిని మోసం చేసిన సింగర్ మంగ్లీపై కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పంజాగుట్ట పోలీసులను కోరారు. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తారు, వారి గురించి మీరు హడావుడి చేయవద్దు అని సుబ్బారావుకు పంజాగుట్ట పోలీసులు సూచించారు. అయితే బాధితుల తరఫున తాను లీడ్ చేస్తున్నానని, లాయర్ గా వారికి అన్ని రకాలుగా చట్ట ప్రకారం సహాయం చేస్తానన్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని, బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

**పాటే నా ప్రాణం.. నన్ను రోడ్డుకు లాగకండి: సింగర్ మంగ్లీ**

మైక్రో ఫైనాన్స్ పేరుతో వందల కోట్ల రూపాయల వసూళ్లకు పాల్పడ్డారంటూ తనపై వస్తున్న ఆరోపణలపై ప్రముఖ టాలీవుడ్ సింగర్ మంగ్లీ తీవ్రంగా స్పందించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ సదరు న్యాయవాదిపై ఆమె నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియా ముందుకు వచ్చిన ఆమె తన ఆవేదనను వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. మార్చి 21న సుభా సియపోగు అనే వ్యక్తి తనను కలిశారని, లాయర్ సుబ్బారావు అనే వ్యక్తితో కలిసి తనను అమర్యాదగా బెదిరించారని మంగ్లీ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు సంబంధం లేని కరెన్సీ నోట్ల వీడియోలు చూపించి, తనను కలవకపోతే పరువు తీస్తానని ఒత్తిడి తెచ్చారని వెల్లడించారు. ఈ పరిణామాలతో తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.

**మీడియాకు మంగ్లీ రిక్వెస్ట్..**

'నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు.. కేవలం పాటే నా ప్రాణం. ఎవరో వచ్చి ఆరోపణలు చేస్తే నిజనిజాలు తెలుసుకోకుండా వార్తలు రాయవద్దు' అని మంగ్లీ మీడియాను వేడుకున్నారు. కేవలం ఫేమస్ అవ్వాలనే ఉద్దేశంతోనే ఆ వ్యక్తి తనపై 150 కోట్ల మోసం అనే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా ద్వారా ఎదిగిన తనకు, అదే శాపంగా మారుతుందని ఎప్పుడూ అనుకోలేదని ఆవేదన చెందారు. గతంలో తనపై రాజకీయ ముద్రలు వేయడంతో తర్వాత ఏ పార్టీకి కూడా తాను పాటలు పాడలేదని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.

## విజయశాంతి రెడ్డి
## ఆత్మహత్య కేసులో కొత్త ట్విస్ట్

**హైదరాబాద్** : హైదరాబాద్ శివారు చర్లపల్లిలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ విజయశాంతి రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్తి కోసం తన అత్తమామలు, బామ్మర్ది పెట్టిన మానసిక క్షోభ తట్టుకోలేకే తన భార్య ఈ దారుణ నిర్ణయం తీసుకుందని భర్త సురేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ ఏడాది జనవరి 31న విజయశాంతి రెడ్డి (38), ఆమె కుమార్తె చైతన్య రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (17) చర్లపల్లి-ఘట్కేసర్ మధ్య గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.ఈ ఘటనపై తాజాగా మేడిపల్లి పోలీసులను ఆశ్రయించిన సురేందర్ రెడ్డి.. తన అత్త పుష్పలత, బామ్మర్ది చిరంజీవి, అతని భార్యపై తీవ్ర ఆరోపణలు చేశారు. "నా భార్య, పిల్లలు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాళ్లు కాదు. సొంతవాళ్లే నమ్మించి మోసం చేశారు. ఆస్తి కోసం తీవ్రంగా వేధించి, మానసికంగా కుంగదీసి వారి చావుకు కారణమయ్యారు" అని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారు చనిపోయిన 25 రోజులకే అత్త, బామ్మర్ది కలిసి తనను ఆస్తి కోసం బెదిరించడం మొదలుపెట్టారని సురేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.భార్యాపిల్లలు చనిపోయిన వెంటనే ఇంట్లో ఉన్న కేజీన్నర బంగారం, రూ.1.40 కోట్ల నగదును తన అత్త పుష్పలత గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్లిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు తనను కూడా టార్గెట్ చేశారని, తనకు ప్రాణహాని ఉందని ఆయన వాపోయారు. తాను కూడా చనిపోతే ఆస్తి మొత్తం వారికే దక్కుతుందనే దురుద్దేశంతో తనను అంతం చేయాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ తనకు ఏమైనా జరిగితే ఆస్తి మొత్తం తన తల్లిదండ్రులకు లేదా ఏదైనా ట్రస్టుకు చెందేలా వీలునామా రాస్తానని, తన కుటుంబాన్ని నాశనం చేసిన వారికి ఒక్క పైసా కూడా దక్కనివ్వనని సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు.హైటెక్ సిటీలో టీమ్ లీడర్గా పనిచేస్తున్న విజయశాంతి, దుబాయ్లో ఉద్యోగం చేస్తున్న సురేందర్ రెడ్డి దంపతులు బోడుప్పల్లో నివసించేవారు. జనవరి 30న హాస్టల్లో ఉన్న పిల్లలను ఇంటికి తీసుకొచ్చిన విజయశాంతి, అర్ధరాత్రి కారులో చర్లపల్లి రైల్వే స్టేషన్కు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. సురేందర్ రెడ్డి తాజా ఫిర్యాదుతో పోలీసులు ఆస్తి వివాదం కోణంలో ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## రహదారి భద్రత పాటిస్తేనే సురక్షిత ప్రయాణం.

**రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ములుగు** : రహదారి భద్రత పాటిస్తేనే సురక్షిత ప్రయాణం అని, రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమనీ అర్రైవ్ అలైవ్ వారోత్సవాల్లో భాగంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు 2026' పోస్టర్ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు 13నుండి వారం రోజుల పాటు 18వ తేదీ వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమాలను నిర్వహించనునట్లు తెలిపారు. నేర్చుకోవడంతో రక్షణ-సాంకేతికతతో మార్పు అనే నినాదంతో ఈ ఏడాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. "బీఏ రోడ్ సేఫ్టీ ఛాంపియన్" అంటూ పిలుపునిస్తూ, జిల్లాలోని వాహనదారులు, విద్యార్థులు, ప్రజలందరూ రహదారి నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా రహదారి ప్రమాదాల్లో భారత్ అగ్రస్థానంలో ఉండటం అందరిని ఆందోళనకు గురి చేస్తున్న అంశమని గత ఏడాది గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు 4,80,000 ప్రమాదాలు జరగగా, అందులో దాదాపు 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ మరణాల వల్ల జీడీపీలో సుమారు 3.14శాతం ఆర్థిక నష్టం వాటిల్లుతుందని, రహదారి ప్రమాదాలకు గురవుతున్న వారిలో 80 శాతం మంది 18 నుండి 60 ఏళ్ల మధ్య వయస్సు గలవారే. కుటుంబానికి ఆధారమైన వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

# బిజినెస్

## ఈ ఆర్థిక సంవత్సరంలో 25,000 మంది ఫ్రెషర్ల నియామకం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోబోతున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. గిరాకీ ఆధారంగా మరింత మందిని నియమించుకుంటామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో టీసీఎస్ 44,000 మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ ఏమైనా మార్పులు చేసిందా? అని కృతివాసన్‌ను ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి శిక్షణ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా మారడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాల ఆధారంగా నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు. 2025-26లో 12,000 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించింది. కంపెనీలో మెరుగైన పని తీరు కనబరిచినంత వరకు కెరీర్‌కు ఇబ్బంది ఉండదని కృతివాసన్ భరోసా ఇచ్చారు. గత ఏడాది కోతలకు, కృత్రిమ మేధ (ఏఐ) కారణమన్న వాదనలను తోసిపుచ్చారు. తొలగించిన ఉద్యోగుల్లో చాలా మంది సీనియర్ లెవల్‌కు చెందిన వారని తెలిపారు.

## 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా పెంపు




పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన అంతరాయాల మధ్య ఇంధన లభ్యతను నిర్వహించే క్రమంలో మన దేశంలో 5 కిలోల చిన్న ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాను పెంచారు. అలాగే పైప్డ్ సహజ వాయువు (పీఎన్‌జీ) కనెక్షన్లను కూడా పెంచారు. మార్చి 23 నుంచి 13 లక్షలకు పైగా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లను విక్రయిం చారు. ప్రస్తుతం రోజువారీ విక్రయాలు లక్ష యూనిట్లను అధిగమించాయి. వలస కార్మికులు, తక్కువ ఆదాయ వినియోగదార్లు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. మార్చి నుంచి 4,24,000 కొత్త పీఎన్‌జీ కనెక్షన్లను యాక్టివేట్ చేశారు. పరివర్తనలో భాగంగా 30,000 మందికి పైగా వినియోగదార్లు ఎల్‌పీజీ కనెక్షన్లను సరెండర్ చేశారు. ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం: పశ్చిమాసియాలో యుద్ధం మొదలై ఆరు వారాలు కావడంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు నెలకొన్నాయి. మన దేశం సగానికి పైగా ముడి చమురును, 40 శాతం గ్యాస్‌ను, 85-90 శాతం ఎల్‌పీజీని ఈ ప్రాంతం నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశ అవసరాల కోసం ఇతర ప్రాంతాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నా, ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం ఉంది. దీంతో ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య వినియోగదార్లకు సరఫరాలో కోతలు విధిస్తూ, గృహ వినియోగదార్లకు ఎల్‌పీజీ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చింది. వంట గ్యాస్ ఎల్‌పీజీ కనెక్షన్లు లేని వారి కొరతను భర్తీ చేయడానికి మార్కెట్ ధరకు లభించే 5 కిలోల సిలిండర్ల సరఫరాను పెంచింది. సంక్షోభానికి ముందు ఫిబ్రవరిలో సుమారు 77,000 అయిదు కిలోల సిలిండర్ల అమ్మకాలు జరగ్గా, గత 2-3 వారాలుగా రోజువారీ అమ్మకాలు లక్ష దాటాయి. గృహ ఎల్‌పీజీ సరఫరాలు మొత్తంగా స్థిరంగా ఉన్నాయని, ఏప్రిల్ 11న 52 లక్షలకు పైగా సిలిండర్లను సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

# చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తాం



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది. చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణను దుర్వినియోగం చేసి ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య జరుగుతున్న ఈ పోరాటం ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. సరఫరా గొలుసును ప్రభావితం చేయడంతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కూడా దారితీయవచ్చు. ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చైనా సహకారం ఒక అడ్డంకిగా ఉంది. ఈ పరిస్థితుల్లో, వాణిజ్య సుంకాలను పెంచడం ద్వారా ట్రంప్ చైనాపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ చర్యలు కొత్త వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# తులం బంగారం ధర చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే



అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చితి నెలకొన్నప్పుడు ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు విఫలం కావడం, హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించడం వంటి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం భయాలను పెంచాయి. దీని ప్రభావంతో స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతుండగా, బంగారం ధరలు మాత్రం రికార్డు స్థాయిలకు చేరుతున్నాయి. నేడు భారతీయ మార్కెట్లో 24 క్యారెట్ల (మేలిమి) బంగారం ధర పది గ్రాములకు రూ.1,52,830 వద్ద పలుకుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో బంగారం ధరలు ఒకే రకంగా ఉన్నాయి. ఇక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,830 కాగా, ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,090 కు చేరింది. అంటే దాదాపు లక్షన్నర రూపాయలకు దగ్గరగా పసిడి రేటు ఉండటంతో పెళ్లిళ్ల సీజన్లో ఉన్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నైలో మాత్రం ధరలు వీటికంటే కాస్త ఎక్కువగా (రూ.1,53,810) ఉన్నాయి. బంగారంతో పోటీ పడుతూ వెండి కూడా భారీగానే పెరుగుతోంది. దేశీయ మార్కెట్లో నేడు కిలో వెండి ధర రూ.2,64,900 వద్ద ఉంది. అంటే గ్రాము వెండి ధర సుమారు రూ.264.90 పలుకుతోంది.

పారిశ్రామికంగా వెండికి డిమాండ్ పెరగడం, ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో వెండి ధరలు కూడా వచ్చే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బంగారం ధరలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పటికీ, యుద్ధ మేఘాలు తొలగిపోకపోతే ఇవి ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ధర తగ్గినప్పుడల్లా కొంచెం కొంచెం కొనుగోలు చేసే బై ఆన్ డిప్స్ పద్ధతిని పాటించాలని సూచిస్తున్నారు. అయితే స్థానిక డిమాండ్, రాష్ట్ర పన్నులు, మేకింగ్ ఛార్జీల బట్టి మీరు కొనే జువెలరీ షాపులో ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.

# ఈ లెక్కన ఎస్‌ఆర్‌హెచ్‌కు మూడినట్లే!




ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ భీకర ఫామ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. బరిలోకి దిగిందే మొదలు బాదుడే లక్ష్యంగా పెట్టుకున్న ఈ బుల్లోడు 266.66 స్ట్రైక్‌రేట్‌తో 200 పరుగులకు పైగా సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో కొనసాగుతున్నాడు. తాను క్రీజులో ఉంటే బౌలర్ ఎవరైతే నాకేంటి.. బంతిపైనే తన దృష్టి ఉంటుందని ఇటీవలే ఆర్సీబీతో మ్యాచ్ అనంతరం డైరెక్ట్ స్టేట్‌మెంట్ విడుదల చేయడం గమనార్హం. ఇప్పటివరకు రాజస్తాన్ ఆడిన ప్రతీ జట్టులో ఒక ప్రధాన బౌలర్‌ను వైభవ్ ఒక ఆట ఆడుకున్నాడు. చెన్నైతో మ్యాచ్‌లో మాట్ హెన్రీని, గుజరాత్‌తో మ్యాచ్‌లో రబాడను, ముంబైతో మ్యాచ్‌లో బుమ్రాను, ఆర్సీబీతో మ్యాచ్‌లో హాజిల్‌వుడ్‌ను లక్ష్యంగా చేసుకొని ఫోర్లు, సిక్సర్లు బాదాడు. ఇక ఇవాళ వైభవ్ సూర్యవంశీ ఎస్‌ఆర్‌హెచ్‌ను వారి సొంతగడ్డపైనే ఎదుర్కోనున్నాడు. బుమ్రా, హాజిల్‌వుడ్, రబాడ వంటి టాప్ బౌలర్లను ఉతికారేసిన వైభవ్ ముందు ఎస్‌ఆర్‌హెచ్ బౌలింగ్ చిన్నబోతోంది. కమిన్స్ లేకపోవడంతో ఎస్‌ఆర్‌హెచ్ బౌలింగ్ బలహీనంగా తయారయ్యింది. ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ బౌలర్ లేకపోవడం మైనస్‌గా మారింది. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లు దారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. యావరేజ్‌గా చూసుకుంటే ప్రతీ ఓవర్‌కు 10.42 పరుగులివ్వడం గమనార్హం. ఐపీఎల్ 2026 సీజన్‌లో బౌలింగ్ పరంగా అత్యంత చెత్త ప్రదర్శన ఎస్‌ఆర్‌హెచ్‌దే. ఇక పేసర్ల పరిస్థితి అగమ్యగోచరంగా కనిపిస్తోంది. హర్షల్ పటేల్, ఉనాద్కట్, ఇషాన్ మలింగలతో కూడిన పేస్ త్రయం ప్రతీ ఓవర్‌కు సగటున 11.47 పరుగులు సమర్పించుకున్నారు. ఈ లెక్కన ఇవాళ్టి మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ మరోమారు చెలరేగితే మాత్రం ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లకు మూడినట్లేనని క్రికెట్ అభిమానులు భావిస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే రాజస్తాన్ రాయల్స్‌తో మ్యాచ్ అంటేనే ప్రత్యర్థి జట్ల బౌలర్లు హడలెత్తిపోయేలా చేస్తున్నాడు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఇక ఐపీఎల్‌లో ఇరుజట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ల్లో ఎస్‌ఆర్‌హెచ్‌దే పైచేయిగా ఉంది. ఇప్పటివరకు ఇరుజట్లు 21 సార్లు తలపడితే ఎస్‌ఆర్‌హెచ్ 12 సార్లు, రాజస్తాన్ 9 సార్లు విజయాలు అందుకున్నాయి. సీజన్‌లో ఇప్పటికే వరుసగా నాలుగు విజయాలతో జోరు మీదున్న రాజస్తాన్ ఐదో విజయంపై కన్నేసింది. మరోవైపు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించిన ఎస్‌ఆర్‌హెచ్ సొంతగడ్డపై రెండో విజయాన్ని అందుకోవాలని చూస్తోంది.

# మహిళల టీ20 వరల్డ్‌కప్.. 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసీసీ




దుబాయ్: ఈ ఏడాది జూన్‌లో మహిళల టీ20 వరల్డ్‌కప్ జరగనున్నది. దీని కోసం ఇవాళ ఐసీసీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచేసింది. రెండు నెలల పాటు ఇంగ్లండ్, వేల్స్‌లో జరిగే వరల్డ్‌కప్ కోసం సుమారు 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది ఐసీసీ. గత ఎడిషన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఈసారి ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ జరగనున్నది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆడుతారు. గత వరల్డ్‌కప్‌లో ప్రైజ్‌మనీ 74 కోట్లు కాగా, ఈసారి 82 కోట్లు ఇవ్వనున్నారు. వరల్డ్‌కప్ విజేతలు ఈసారి 21.8 కోట్ల ప్రైజ్‌మనీ గెలుచుకుంటారు. ఇక రన్నరప్‌కు 10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్లోకి ఎంటరైన జట్లకు 6.29 కోట్లు ఇవ్వనున్నారు. ఇక గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకు 29 లక్షలు ఇవ్వనున్నారు. ప్రతి జట్టుకు కనీసం రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది. జూన్ 12వ తేదీన బర్మింగ్ హామ్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్ , స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు ఆడనున్నారు.

# స్పోర్ట్స్

## డగౌట్‌లో సెల్‌ఫోన్.. రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్‌కు బీసీసీఐ నోటీసులు




**గౌహతి:** రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి బిందర్ చిక్కుల్లో పడ్డారు. గత శుక్రవారం ఆర్సీబీతో మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఆయన డగౌట్‌లో సెల్‌ఫోన్‌తో కనిపించారు. ఈ ఘటన పట్ల బీసీసీఐ సీరియస్‌గా ఉంది. రోమి బిందర్‌కు ఇవాళ బీసీసీఐ నోటీసులు జారీ చేసింది. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడినట్లు బిందర్‌పై ఆరోపణలు వస్తున్నాయి. టీమ్ డగౌట్‌లో ప్లేయర్లు ఉండే ప్రదేశంలో మేనేజర్ రోమి బిందర్ సెల్‌ఫోన్ చూస్తున్నట్లు దృశ్యాలు రిలీజ్ అయ్యాయి. పక్కనే కూర్చుకున్న వైభవ్ సూర్యవంశీ .. అతని ఫోన్‌ను తీక్షణంగా చూస్తున్నట్లు ఆ వీడియోలో ఉన్నది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో వివాదం ముదిరింది. దీనిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఐపీఎల్ ఛైర్మెన్ లలిత్ మోదీ కూడా డిమాండ్ చేశారు. బీసీసీఐకి చెందిన యాంటీ కరప్షన్ అండ్ సెక్యూర్టీ యూనిట్(ఏసీఎస్‌యూ) రోమి బిందర్‌కు నోటీసులు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా ఈ చర్యకు పాల్పడింది. అయితే 48 గంటల్లో ఆయన తన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దేని కోసం రోమి బిందర్ డగౌట్ ఏరియాలో ఫోన్ పట్టుకున్నారో తన వివరణలో చెప్పాల్సి ఉంటుంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని ఏసీఎస్‌యూ విభాగాన్ని ఆదేశించామని, దీనిపై నివేదికను ఇవ్వాలని కోరినట్లు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మెన్ అరుణ్ ధుమాల్ ఓ మీడియాతో తెలిపారు. అయితే ఆరోగ్య కారణాల కోసం బిందర్ ఫోన్ వాడి ఉంటారని భావిసత్‌ఉన్నారు. గతంలో ఆర్ఆర్ టీమ్ మేనేజర్‌కు ఆరోగ్య సమస్యలు ఎదరయ్యాయి. నాగపూర్‌లో ఓసారి ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. మెడికల్ కారణాల చేత ఆయన తన ఫోన్‌కు డగౌట్‌కు తీసుకెళ్లే వీలు ఉంది, కానీ అక్కడ కూర్చుని ఫోన్‌ను వాడరాదు అని నియమావళి ఉన్నట్లు తెలుస్తోంది. రోమి ఇటీవల 10 కిలోల బరువు తగ్గినట్లు కొన్ని రిపోర్టుల ద్వారా తెలిసింది. అయితే రోమి మెడికల్ కండీషన్‌ను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ అధికారులు చర్యలు తీసుకుంటారని చెబుతున్నారు.



## ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ 'డ్రాగన్'పై పెరుగుతున్న హైప్


పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమా రోజురోజుకు వార్తల్లో నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ క్రేజ్‌ను సంపాదించింది. 'ఆర్ఆర్ఆర్', 'దేవర' వంటి వరుస విజయాల తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా కావడం, 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించడం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే, గత కొన్ని రోజులుగా ఈ సినిమాకు సంబంధించి షూటింగ్, నటీనటుల ఎంపికపై సోషల్ మీడియాలో అనేక రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో హీరోతో సమానంగా పవర్‌ఫుల్ విలన్ పాత్ర ఉంటుందని ఇప్పటికే టాక్. తొలుత మలయాళ స్టార్ టోవినో థామస్ ను నెగటివ్ రోల్ కోసం సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఈ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఎన్టీఆర్‌కు ధీటుగా నిలిచే విలన్‌గా ఆయనను ఎంపిక చేయాలని మేకర్స్ భావిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే చర్చలు జరిగాయని, త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని టాక్ నడుస్తోంది. ఇక షూటింగ్ ఆగిపోయిందంటూ వచ్చిన వార్తలను చిత్ర బృందం ఖండించింది. ఎన్టీఆర్ లుక్ విషయంలో డైరెక్టర్‌తో విభేదాలు వచ్చాయని ప్రచారం జరిగినా, అందులో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో భారీ యాక్షన్ సన్నివేశాల కోసం ప్రతి షెడ్యూల్ మధ్య గ్యాప్ తీసుకోవడం సాధారణమేనని, ప్రస్తుతం షూటింగ్ ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతోందని తెలిపింది. ఈ సినిమాలో ఎన్టీఆర్ ఇప్పటివరకు చూడని రగ్గడ్, ఊర మాస్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే లీక్ అయిన కొన్ని ఫొటోలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ లేదా టైటిల్ టీజర్ విడుదల చేసే అవకాశముందని తెలుస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తుండగా, బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. సంగీతాన్ని రవి బస్రూర్ అందిస్తున్నారు. ఈ సినిమా 2026 చివరిలో లేదా 2027 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే అవకాశం ఉంది.

## కాశీ అనుభవాలపై నటుడు ఆర్య సంచలన వ్యాఖ్యలు

### సాధువుల వేషంలో క్రిమినల్స్ ఉన్నారంటూ కామెంట్



తమిళ్‌తో పాటు తెలుగులోనూ హీరోగా, విలన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు ఆర్య తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. త్వరలో విడుదల కానున్న తన కొత్త చిత్రం 'మిస్టర్ ఎక్స్' ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా ప్రారంభమయ్యాయి. తన కెరీర్ ప్రారంభంలో చేసిన నేనే దేవుడ్ని సినిమా షూటింగ్ సందర్భంగా ఎదురైన అనుభవాలను ఆర్య గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా కోసం వారణాసి (కాశీ)లో కొంతకాలం షూటింగ్ జరిపామని, అక్కడ నిజమైన సాధువులతో పాటు నకిలీ వ్యక్తులు కూడా ఉన్నారని తెలిపారు. ఆర్య మాట్లాడుతూ.. కాశీలో ఉన్న సాధువుల్లో చాలా మంది నిజాయితీ గలవాళ్లే. కానీ కొంతమంది మాత్రం సాధువుల వేషంలో క్రిమినల్స్‌గా ఉంటారు. వాళ్లకు ఎలాంటి గుర్తింపు పత్రాలు ఉండవు. పేరు అడిగినా 'స్వామి' అని మాత్రమే చెబుతారు. కొంతకాలం అక్కడ దాక్కొని తర్వాత వెళ్లిపోతారు" అని చెప్పారు అంతేకాకుండా కుంభమేళా సందర్భంగా కూడా ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశముందని ఆర్య వెల్లడించారు. "మేము కుంభమేళా షూటింగ్‌కు వెళ్లినప్పుడు పోలీసులు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది సాధువుల వేషంలో ఆయుధాలు కూడా కలిగి ఉంటారని చెప్పారు అని ఆయన పేర్కొన్నారు. ఆర్య చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొంతమంది ఆయన మాటలకు మద్దతు తెలుపుతూ, వాస్తవ పరిస్థితులను వెల్లడించారని అంటుండగా... మరికొందరు మాత్రం ఇలాంటి వ్యాఖ్యలు మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శిస్తున్నారు.ఏదేమైనా, ఒక ప్రముఖ నటుడు ఇలాంటి విషయాలపై బహిరంగంగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. ఇది నిజంగా పరిస్థితులని ఉద్దేశించి చెప్పడమా ? లేక అతిశయోక్తి వ్యాఖ్యలా? అనే దానిపై ప్రస్తుతం నెటిజన్ల మధ్య తీవ్ర చర్చ కొనసాగుతోంది.



## ఎస్క్వైర్ ఇండియా కవర్ పేజ్‌పై రామ్ చరణ్ మెరుపులు.. గ్లోబల్ స్థాయిలో అరుదైన గుర్తింపు!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ వేదికపై తన ముద్ర వేసుకున్నారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఎస్క్వైర్ ఇండియా ఏప్రిల్ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన దర్శనమిచ్చారు. దుబాయ్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన ఈ ఫోటోషూట్‌లో రామ్ చరణ్ స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న చరణ్... ఈ కవర్ ఫీచర్‌తో మరో మైలురాయిని అందుకున్నారు. గతంలో జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇదే మ్యాగజైన్ కవర్‌పై కనిపించగా, ఇప్పుడు ఆ ఘనత సాధించిన రెండో తెలుగు హీరోగా రామ్ చరణ్ నిలిచారు. దీంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫోటోషూట్‌లో చరణ్ స్టైలింగ్, ప్రెజెన్స్ అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోకుండా ఉండటంతో, ఆయన గ్లోబల్ అప్పీల్ మరింత బలపడిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభిమానులు ఆయన పూర్తి ఇంటర్వ్యూకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యింది. ఒక పాట మినహా మిగిలిన భాగాలన్నీ కంప్లీట్ కాగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు యూట్యూబ్‌లో భారీ వ్యూస్ సాధించి మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. బుచ్చిబాబు స్టైల్ ఎమోషన్స్, చరణ్ మేకోవర్ కలిసి ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఒకవైపు అంతర్జాతీయ మ్యాగజైన్ కవర్‌పై మెరుస్తూ, మరోవైపు క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న రామ్ చరణ్... ఈ ఏప్రిల్‌లో అభిమానులకు డబుల్ ట్రీట్ అందిస్తున్నాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## గోపీచంద్ 'భరతవర్ష' గ్లింప్స్ విడుదల..

### యోధుడిగా అదిరిపోయే లుక్, దేశభక్తి కథపై అంచనాలు పీక్స్!



యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



## ఎన్నాళ్లీ సింగిల్ బతుకు? క్లారిటీ ఇచ్చిన రామ్

తెలుగు హీరోల్లో బ్యాచిలర్స్ అనుకున్న వాళ్లకు కూడా ఒక్కొక్కళ్లకు పెళ్లిళ్లు అయిపోతున్నాయి. ప్రస్తుతం చూసుకుంటే ప్రభాస్, రామ్, సాయిధరమ్ తేజ్ లాంటి కొందరు మాత్రమే ఇంకా సింగిల్‌గా ఉన్నారు. వీళ్లలో ప్రభాస్ చేసుకుంటాడా అంటే సందేహమే. సాయిధరమ్ తేజ్ మాత్రం ఈ ఏడాదో వచ్చే ఏడాదో శుభవార్త చెప్పేలా ఉన్నాడు. రామ్ మాత్రం ఇప్పుడు తన సింగిల్ స్టేటస్, పెళ్లి వాటిపై పరోక్షంగా క్లారిటీ ఇచ్చేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయమై స్పందించాడు. 'చిన్నప్పటి నుంచి నేను ఒంటరిగా ఉండటం అలవాటుపడ్డా. ఖాళీ టైంని ఒక్కడినే ఆస్వాదిస్తుంటా. స్నేహితులు, మిగతా వాళ్లతో గడపటం ఇష్టమే ?కానీ నాకోసం నేను టైమ్ కేటాయించుకోవడంలో ఆనందముంది. ఆ ఏకాంతం నాకు ఎంతో రిలాక్స్‌గా అనిపిస్తుంది. ఎవరైనా నా జీవితంలోకి వస్తే వాళ్లతో సమయం గడిపేందుకు సిద్ధమే. రాకపోయినా ఒంటరిగా సంతోషంగా ఉంటాను. ఇదేదో కావాలని తీసుకున్న నిర్ణయమైతే కాదు' అని రామ్ చెప్పుకొచ్చాడు. రామ్ మాటల బట్టి చూస్తుంటే జీవితాంతం సింగిల్‌గానే ఉండిపోతాడేమో అనిపిస్తుంది. ఇతడి గత సినిమా 'ఆంధ్ర కింగ్ తాలుకా' టైంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేతో డేటింగ్ రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు రామ్ మాటల బట్టి చూస్తుంటే అవన్నీ ప్రమోషన్స్ కోసం సృష్టించినట్లే అనిపిస్తున్నాయి. ఇకపోతే ఇండస్ట్రీలో వందలాది మందితో పనిచేయడం గురించి మాట్లాడుతూ.. అది తప్పదని చెబుతూనే, అందరి మధ్య కూడా తనకంటూ ఓ ప్రత్యేక ప్రపంచాన్ని నిర్మించుకున్నానని చెప్పుకొచ్చాడు. లాక్‌డౌన్‌లో ఏడాదిన్నర పాటు ఒంటరిగానే బతికానని గుర్తుచేసుకున్నాడు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463